మనం!

జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 18 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | గురువారం • 17-1-2019 | www.manamnews.com | /manamnews



అరుణ్‌జైట్లీకి కేన్సర్

అమెరికాకు పయనం.. చికిత్స

బడ్జెట్‌కు అందుబాటులో అనుమానమే



కులాల కుమ్ములాట

7

మళ్లీ లింగాయత్‌లు.. వొక్కలిగల పోరు

2008లోనూ ఇదే తరహా పోరాటం

యడ్యూరప్ప-కుమారస్వామి ఫైట్

ఇప్పుడు అదే తరహా పరిణామాలు

కర్ణాటకలో ప్రభావవంతమైన కులాలు

ఇద్దరూ కలిపి జనాభాలో 30 శాతం

అసెంబ్లీలో సగం బలం ఈ ఇద్దరిదే

ఎంపీలోనూ కర్నాటకం!

కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో బేరసారాలు

అప్రమత్తమైన హస్తం అధిష్ఠానం



భారీగా జల్లికట్టు

మదురైలో 19 మందికి గాయాలు

పోటీలలో వెయ్యికి పైగా ఎద్దులు

నేడు మరింత భారీ స్థాయిలో పోటీ



కేసీఆర్ ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నా

42 మంది ఎంపీలు కలిస్తే కేంద్రంపై ఒత్తిడి

- రాష్ట్రాల ప్రయోజనాలు ముఖ్యం
- ఏకం కావాల్సిన అవసరం ఉంది
- ఇవి ప్రాథమిక చర్చలు మాత్రమే
- కేసీఆర్ కూడా కలుస్తామన్నారు
- మేం తప్పక ముందడుగు వేస్తాం
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వెల్లడి
- జగన్‌తో భేటీ అయిన కేటీఆర్..
- ఏపీ హోదాకు మా పూర్తి మద్దతు
- రెండు రాష్ట్రాల కోసం కలిసి పోరు
- గుణాత్మక మార్పు కోసం క షి
- కేసీఆర్ ఆదేశం మేరకే చర్చలు

హైదరాబాద్, జనవరి 16:

రాష్ట్రాలకు దక్కాల్సిన హక్కుల కోసం పోరాటంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఫెడరల్ ఫ్రంట్ పేరిట చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నానని వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ప్రయత్నాలలో భాగంగా జగన్‌తో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్ లోటస్ పాండ్ లోని జగన్ నివాసంలో భేటీ అయ్యారు. సుమారు గంటన్నర సేపు సుదీర్ఘంగా చర్చించిన తర్వాత జగన్, కేటీఆర్ కలిసి మీడియాతో మాట్లాడారు. అంతకుముందు తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకే తాను జగన్ ను కలిసేందుకు వెళ్తున్నట్లు కేటీఆర్ ట్వీట్ చేశారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు గురించి ఆయనతో ప్రాథమికంగా చర్చించేందుకు తమ బృందం వెళ్తోందని ఆ ట్వీట్ ద్వారా కేటీఆర్ తెలిపారు. దాంతో ఒక్కసారిగా వీరిద్దరి భేటీపై ఆసక్తి ఏర్పడింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తనతో ఫోన్లో మాట్లాడిన తర్వాత తారక్ (కేటీఆర్) వచ్చి కలిశారని, రాష్ట్రాలకు కేంద్రం చేస్తున్న అన్యాయం.. కేంద్రాన్ని ఎదుర్కోవాలంటే దేశవ్యాప్తంగా రాష్ట్రాలు ఏకం కావాల్సిన అవసరం గురించి తనతో చర్చించారని జగన్ చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీకే దిక్కులేదని, హోదా విషయంపై తాము ఎంత పోరాడినా కేంద్రంలో కదలిక లేదని అన్నారు. ఏపీకి చెందిన 25 మంది ఎంపీలకు తోడుగా తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీలు కూడా కలిస్తే కేంద్రంపై మరింత ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రాల హక్కుల నిలబడాలంటే రాష్ట్రాల తరఫున మాట్లాడేవారి సంఖ్య పెరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రాల ప్రయోజనాల కోసం తెలంగాణ సీఎం

..మిగతా 2లో

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్

ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, జనవరి 16 (మనం ప్రతినిధి)

తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ బుధవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ నరసింహన్, ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో ప్రొటెం స్పీకర్ గా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొన్నారు. గురువారం అసెంబ్లీలో సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక నామినేషన్ నిర్వహించనున్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారానికి చేయడానికి ముందు సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి గురువారం ఉదయం గన్ పార్కు వద్ద అమరులకు నివాళులర్పించనున్నారు. అనంతరం ఉదయం 11.05 గంటల నుంచి అసెంబ్లీలో నిర్వహించే కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ప్రొటెం స్పీకర్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. జనవరి 18న స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారు. అలాగే ఈనెల 19న ఉదయం 11.30 గంటలకు మండలి సమావేశం ప్రారంభమవుతుంది. ఈనెల 19న ఉభయసభల సభ్యులనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది.

ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

పార్టీ ఫిరాయించినందుకే!

భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములు నాయక్‌లను అనర్హులుగా ప్రకటించిన ఛైర్మన్ స్వామిగౌడ్



హైదరాబాద్ :

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు పడింది. భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములు నాయక్‌లను శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అనర్హులుగా

..మిగతా 2లో

నేటి నుంచి అసెంబ్లీ

ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్

18న స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల ఎన్నిక

19న గవర్నర్ ప్రసంగం, 20న ధన్యవాద తీర్మానం

నాలుగు రోజుల పాటు జరుగనున్న అసెంబ్లీ



హైదరాబాద్, జనవరి 16 (మనం ప్రతినిధి):

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. నాలుగు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. 18న స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల ఎన్నిక జరుగనుంది. 19న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉండనుంది. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చేపట్టనున్నారు. ధన్యవాద తీర్మానాన్ని కొప్పుల ఈశ్వర్ ప్రవేశపెట్టనున్నారు. అటు మండలిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు

..మిగతా 2లో

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శుక్లపక్షం, ఏకాదశి సా.6.32 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: కృత్తిక ఉ.10.12 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: రా.1.48 నుంచి 3.23 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.17 నుంచి 11.05 వరకు, తదుపరి ప.2.43 నుంచి 3.28 వరకు, రాహుకాలం: ప.1.30 నుంచి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుంచి 7.30 వరకు, అమృతఘడియలు: ఉ.7.54 నుంచి 9.19 వరకు

ఇదీలోకం!



వేడెక్కిన కర్నాటకం

సర్కారుకు ఇద్దరు స్వతంత్రుల గుడ్‌బై

- అయినా ఇప్పటికే తగిన బలం
- మొత్తం సభలో సభ్యులు 224
- సంకీర్ణ ప్రభుత్వ బలం.. 117
- గుర్‌గావ్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు
- జోరుగా కొనుగోలు యత్నాలు
- మా సర్కారు పూర్తిగా సురక్షితం
- ఇబ్బంది లేదు: కుమార స్వామి
- మళ్లీ ఆపరేషన్ లోటస్: కాంగ్రెస్



బెంగళూరు, జనవరి 16:

బెంగళూరులో ఒకవైపు చలిగాలులు వీస్తూనే ఉన్నా.. రాజకీయ పరిణామాలు మాత్రం వేడెక్కిస్తున్నాయి. ఏడు నెలల కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి ఝలక్ ఇస్తూ.. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఆర్. శంకర్ (రాణెబెన్నూరు), హెచ్. నగేశ్ (ముల్బాగల్) సర్కారుకు తమ మద్దతు ఉపసంహరించుకున్నారు. 224 మంది సభ్యులున్న కర్ణాటక అసెంబ్లీలో ఇంకా సంకీర్ణ ప్రభుత్వానికి 117 మంది

..మిగతా 2లో

ప్రపంచబ్యాంకు రేసులో ఇంద్రానూయి?

ఆమెను ప్రతిపాదిస్తున్న ఇవాంకా ట్రంప్

- పెప్సికో సారథిగా నూయికి మంచి పేరు
- ఆమెను నామినేట్ చేస్తారన్న పత్రికలు
- గతంలో ట్రంప్‌పై నూయి పరోక్ష వ్యాఖ్య
- అయినా.. ఆమెకే దక్కేందుకు అవకాశం



వాషింగ్టన్, జనవరి 16:

పెప్సికో మాజీ సీఈవో, భారత సంతతికి చెందిన ఇంద్రా నూయి ఈసారి ప్రపంచబ్యాంకు పగ్గాలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. అమెరికా తరపున ఆమెను ఆ పదవికి నామినేట్ చేయాలని శ్వేతసౌధం వర్గాలు భావిసున్నట్లు అమెరికాలోని ప్రముఖ పత్రికలు పేర్కొంటున్నాయి. పెప్సికోకు విజయవంతంగా 12

..మిగతా 2లో



వేడెక్కిన కర్ణాటకం

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుంది. దాంతో ఇప్పటికిప్పుడు ప్రభుత్వ మనుగడకు వచ్చిన నష్టమేమీ లేదు. కావల్సిన మేజిక్ సంఖ్య కంటే నలుగురు ఎక్కువగానే ఉన్నారు. కానీ.. ఒకవేళ ప్రభుత్వం పడిపోతే తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటూ బీజేపీ నేతలు ప్రకటిస్తుండటంతో ఎక్కడ తమ ఎమ్మెల్యేలు జారిపోతారోనని ఇటు కాంగ్రెస్, అటు జేడీఎస్ రెండు పార్టీలు ఆందోళనకు గురవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ వైపు మొగ్గచ్చని విశ్వసనీయ వర్గాల అంచనా. మరోవైపు అవసరమైతే బీజేపీ ఎమ్మెల్యేలను కూడా లాక్కోవాలని సంకీర్ణ సర్కారు భావిస్తున్నట్లు తెలియడంతో అటూ ఇటూ బేరసారాలు సాగుతున్నాయి. దీంతో ఎవరికి వారు తమ ఎమ్మెల్యేలను భద్రంగా హోటళ్లలోని క్యాంపులలో దాచిపెట్టారు. తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని.. తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని ముఖ్యమంత్రి కుమారస్వామి ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీల ఎమ్మెల్యేలందరితో టచ్‌లో ఉన్నామని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యానించారు.

ఒకవేళ బీజేపీ ఎలాగైనా కుమారస్వామి సర్కారును పడగొట్టాలనుకుంటే.. అప్పుడు కనీసం 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి. అప్పుడు సభ బలం 210కి వచ్చేస్తుంది. అప్పుడు ఇద్దరు స్వతంత్ర సభ్యుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ, ఇదంత సులభంగా అయ్యే పని కాదు. ఒకవేళ బీజేపీ ఈ లక్ష్యాన్ని సాధించినా, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బదులు రాష్ట్రపతి పాలన విధించే అవకాశం లేకపోలేదని కూడా అంటున్నారు. ఒకవేళ సర్కారుకు మద్దతు ఉపసంహరించుకున్న ఇద్దరు స్వతంత్రులు అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఊరించగలిగితే, వాళ్లు వచ్చే నాలుగైదు రోజుల్లో రాజీనామా చేయచ్చు. అప్పుడు బీజేపీకి 14 మంది ఎమ్మెల్యేల బలం కలిసి అధికారాన్ని చేపడితే.. సభలో బలం నిరూపించుకోవాల్సి ఉంటుంది. కానీ ఒకవేళ బీజేపీ, కాంగ్రెస్–జేడీఎస్‌లలో ఎవరూ ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాకపోతే కేంద్రం కర్ణాటక అసెంబ్లీని సుప్త చేతనావస్థలో ఉంచి రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుంది. కానీ, అసెంబ్లీ స్పీకర్.. సభ్యుల రాజీనామాలను ఆమోదించకుండా ఎంత కాలమైనా తనవద్ద పెండింగులో ఉంచుకునే అవకాశం కూడా లేకపోలేదు. అదే సంభవిస్తే.. ఎటూ కాని పరిస్థితి తలెత్తుతుంది. ఇదంతా కాకుండా.. నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు అధికార కూటమివైపు వచ్చారంటే బీజేపీ ప్రణాళికలన్నీ కుప్పకూలిపోతాయి. ప్రభుత్వం యథాతథంగా నడుస్తుంది.

బడ్జెట్‌కు ముందు..

ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి కుమారస్వామి రెండో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఇందులోనే ఆయన ఒక్కవిడతలోనే రూ. 46 వేల కోట్ల రుణమాఫీని ప్రకటించాలని కూడా భావిస్తున్నట్లు తెలిపారు. ఇది జరిగితే ప్రభుత్వానికి ప్రజల్లో మద్దతు పెరుగుతుంది. అందుకే ఏమైనా చేయాలంటే ఈ లోపే చేయాలని కమలనాథులు భావిస్తున్నట్లు రాజకీయ పండితులు చెబుతున్నారు.

ఎమ్మెల్యేలు వాపస్

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు అదృశ్యం అయ్యారని ఆందోళన చెందుతుండగా.. వాళ్లు తిరిగి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. హగరి బొమ్మనహళ్లి ఎమ్మెల్యే భీమా నాయక్ కాంగ్రెస్ నాయకులున్న గెస్ట్‌హౌస్ వద్దకు బుధవారం చేరుకున్నారు. మరో ఎమ్మెల్యే అంతకంటే కొద్ది ముందుగానే వచ్చేశారు. తమ ఎమ్మెల్యేలలో ఐదుగురు తమతో టచ్‌లో లేరని కాంగ్రెస్ వర్గాలు సోమవారం ఆందోళన వ్యక్తం చేశాయి. వారిలో ముగ్గురు ముంబైలోని ఒక హోటల్లో ఉండి.. బీజేపీ నేతలతో మాట్లాడుతున్నారని అన్నారు. వాళ్లకు ఎంత ఆఫర్ చేశారో కూడా తమకు తెలుసని కాంగ్రెస్ ట్రబుల్ షూటర్‌గా పేరొందిన మంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఈ విషయాన్ని భీమానాయక్ కూడా పరోక్షంగా నిర్ధారించారు. తనకు రెండు నంబర్లున్నాయని, ఒకటి స్విచాఫ్ చేసేశానని, రెండోది బీజేపీ వాళ్లకు తెలియదని ఆయన చెప్పారు. 'ఆపరేషన్ లోటస్' ద్వారా తమ ప్రభుత్వాన్ని పడగొట్టి అధికారం చేపట్టాలన్నది బీజేపీ ప్రయత్నమని కాంగ్రెస్ అంటోంది. మరోవైపు కాంగ్రెస్ వర్గాలు ఎక్కడ తమ ఎమ్మెల్యేలను లాక్కునేందుకు ప్రయత్నిస్తాయోనని బీజేపీ కూడా తమ మొత్తం 104 మంది ఎమ్మెల్యేలను గుర్‌గావ్‌లని ఒక లగ్జరీ రిసార్టులో ఉంచింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు శిక్షణ కోసం వారిని అక్కడ సమావేశపరిచామని పైకి చెబుతున్నా, కర్ణాటక పరిణామాల నేపథ్యంలోనే అక్కడ శిబిరం ఏర్పాటుచేశారని తెలుస్తోంది.

కేసీఆర్ ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నా


(మొదటి పేజీ తరువాయి)



కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఇప్పుడు జరిగినవి ప్రాథమిక చర్చలు మాత్రమేనని, త్వరలోనే కేసీఆర్ కూడా వచ్చి కలుస్తామన్నారని, అప్పుడు ఫెడరల్ ఫ్రంట్‌పై మరింతగా చర్చిస్తామని తెలిపారు. కేటీఆర్‌తో చర్చించిన అంశాలపై పార్టీలో విస్త తంగా చర్చిస్తామని కూడా వైఎస్ జగన్ చెప్పారు. కేసీఆర్ ప్రతిపాదించిన జాతీయ వేదికవైపు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చి ఒకటవ్వాలని, అది హర్షించదగ్గదని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ దిశగా తప్పక ముందడుగు వేస్తామన్నారు.

హోదాకు పూర్తి మద్దతు: కేటీఆర్

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలని తమ పార్టీ అధినేత కేసీఆర్ ఏడాదిన్నర నుంచి కృషి చేస్తున్నారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు చెప్పారు. ఇప్పటికే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఛత్తీస్‌గఢ్ నాయకుడు అజిత్ జోగి, డీఎంకే అధినేత స్టాలిన్, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్‌లతో పాటు మరికొంత మందిని కేసీఆర్ కలిశారని, ఈ నేపథ్యంలోనే ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌కు కేసీఆర్ ఫోన్ చేసి ఫెడరల్ ఫ్రంట్‌పై మాట్లాడాలని కోరారని తెలిపారు. ఇందులో భాగంగానే తాను జగన్‌తో సమావేశమయ్యానన్నారు. తెలంగాణ, ఏపీ ప్రయోజనాల కోసం కలిసి పోరాడే విషయంపై చర్చించామని తెలిపారు. ఇవి ప్రాథమిక చర్చలేనని, త్వరలోనే కేసీఆర్ స్వయంగా జగన్‌ను కలిసి ఫెడరల్ ఫ్రంట్‌పై కులంకషంగా చర్చిస్తారని చెప్పారు. ప్రత్యేక దొకు సంబంధించి తమ వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశామని, హోదా విషయంలో ఏపీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా విషయంలో టీఆర్ఎస్ వైఖరిపై కేసీఆర్ ఇప్పటికే స్పష్టంగా ప్రకటించారని, రాజ్యసభలో కేశవరావు, లోక్ సభలో కవిత కూడా ఏపీకి ప్రత్యేక హోదా కావాలని అడిగారని, ఈ విషయంలో తమకు రెండో అభిప్రాయం అని, రెండో ఆలోచన గానీ లేదని ఆయన అన్నారు. వైసీపీ బ ందంతో అన్ని విషయాలూ చర్చించామని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉండేలా జాతీయ రాజకీయాలు ఉండాలని ఇరువురం భావించామని అన్నారు. త్వరలోనే త్వరలో ఏపీకి కేసీఆర్ వెళ్లి జగన్ తో మిగతా విషయాలు చర్చిస్తారని, రెండు తెలుగు రాష్ట్రాలప్రయోజనాలు కాపాడటంపై మాట్లాడతారని అన్నారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ నేతలు వినోద్, సంతోష్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌లతో పాటు.. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వి. విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామక ష్ణారెడ్డి, పార్థసారథి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.



నేటి నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం రాత్రి సీఎల్పీ భేటీ జరిగింది. సీఎల్పీ నేతను గురువారం ప్రకటించే అవకాశం ఉంది. స్పీకర్ ఎన్నిక, మంత్రివర్గ విస్తరణపై అధికార పక్షంలో ఉత్కంఠ కొనసాగుతుంది. పరిమితమైన సంఖ్యలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అశావాహుల్లో ఉత్కంఠ కొనసాగుతునే ఉంది. ఇప్పటికే కొంత మంది మాజీ మంత్రలకు భద్రతను కుదించి, మంత్రివర్గంలో స్దానం ఉండక పోవచ్చనే సంకేతాలు ఇచ్చారు. మంత్రులందరికీ శిక్షణ ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కనడంతో పాత వారికంటే కూడా కేసీఆర్ మంత్రివర్గంలో కొత్తవారే అధికంగా ఉంటారనే ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రుల జాబితాను సిద్దం చేసుకున్నారని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ ఉంటుందా లేక మరింత జాప్యం జరుగుతుందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల అనంతరం బడ్జెట్ సమావేశాలకు ముందు కొంత మందితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నె 18న మంత్రివర్గ విస్తరణ లేని పక్షంలో ఇక ఎప్పుడు ఉంటుందనే దానిపై చర్చ అనవసరం అని సీనియర్లు వ్యాఖ్యానించడం గమనార్హం.





బీజేపీ మేనిఫెస్టో కమిటీ రెడీ

అధ్యక్షురాలిగా పురందేశ్వరి

కన్వీనర్ పదవిలో ఐవైఆర్.. 11 మందితో కమిటీ సిద్ధం

ఎన్నికల కసరత్తు ప్రారంభం

గుంటూరు, జనవరి 16:

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ అప్పుడే తన కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడానికి చేపట్టనున్న బస్సు యాత్రకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాజాగా ఎన్నికల్లో బీజేపీ ప్రజలకు చేరువయ్యేలా మేనిఫెస్టోను రూపొందించడానికి కన్నా లక్ష్మీనారాయణ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి బీజేపీ సీనియర్ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి చైర్‌పర్సన్‌గా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవైఆర్ క ష్ణారావు కన్వీనర్‌గా ఉన్నారు. వీరిద్దరితో పాటు కమిటీలో మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారు.

కమిటీ ఇలా...

డి.పురందేశ్వరి(చైర్‌పర్సన్), ఐవైఆర్ కృష్ణారావు (కన్వీనర్), సభ్యులు.. పి. విజయ బాబు, పీవీఎన్ మాధవ్, దాసరి శ్రీనివాసులు, షేక్ మస్తాన్, పాక సత్యనారాయణ, కె. కపిలేశ్వరయ్య, పాకలపాటి సన్యాసిరాజు, సుధీష్ రాంభొట్ల, డీఏఆర్ సుబ్రహ్మణ్యం.



ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ముగ్గురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు మండలి ఛైర్మన్ తేల్చడంతో వీరిని అనర్హులుగా ప్రకటిస్తూ కార్యదర్శి బులెటిన్ విడుదల చేశారు. అనర్హత వేటు తక్షణమే అమల్లోకి రానుంది. గవర్నర్ కోటాలో రాములు నాయక్, ఎమ్మెల్యేల కోటాలో యాదవరెడ్డి, స్థానిక సంస్థల కోటాలో భూపతిరెడ్డి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌లో చేరిన కొండా మురళి రాజీనామాను ఇప్పటికే ఆమోదం తెలిపారు.

ప్రపంచబ్యాంకు రేసులో ఇంద్రానూయి?

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాల పాటు సారథ్యం వహించిన తర్వాత గత సంవత్సరం ఆగస్టులో ఇంద్రా నూయి (63) స్వచ్ఛందంగా తప్పుకొన్నారు. నామినీ ఎంపికలో ప్రధానపాత్ర పోషిస్తున్న అమెరికా అధ్యక్షుడి పెద్దకూతురు ఇవాంకా ట్రంప్ స్వయంగా ఇంద్రా నూయిని ప్రతిపాదిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక తన కథనంలో రాసింది. అధ్యక్షుడు ట్రంప్ ఎంపికే చిట్ట చివరగా ఖాయం అవుతుందని, ఈలోపు చాలా పేర్లు వస్తూ.. పోతూ ఉంటాయని కూడా ఆ కథనంలో రాశారు. అయితే, అసలు ఇంద్రా నూయి ఆ పదవికి నామినేషన్‌ను అంగీకరిస్తారో.. లేదో అన్నది కూడా ఇంకా తెలియలేదు. నూయిని తాను ప్రతిపాదిస్తున్న విషయాన్ని ఇవాంకా ఒక ట్వీట్ ద్వారా తెలిపారు. ఆమె తన మెంటార్, ఆమే తన స్ఫూర్తి అని అన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రస్తుత అధ్యక్షుడు జియ్ యాంగ్ కిమ్ మూడేళ్ల ముందుగానే పదవి నుంచి ఫిబ్రవరిలో తప్పుకొంటున్నట్లు ఈ నెల ఆరంభంలో ప్రకటించారు. తాను ఒక ప్రైవేటు మౌలిక సదుపాయాల పెట్టుబడి కంపెనీలో చేరుతానన్నారు. దాంతో వెంటనే ఆయనకు వారసుల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టాల్సి వచ్చింది. అయితే, ప్రపంచబ్యాంకు అధ్యక్ష పదవికి అమెరికా తరపున నామినీ ఎంపికలో ఇవాంకా ట్రంప్ పాత్ర పట్ల కొన్ని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె తన ఆస్తులను పూర్తిగా వదులుకోకముందే అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలలో ఎలా వేలు పెడతారని కొంతమంది విమర్శిస్తున్నారు. అయితే త్వరలోనే నామినీ ఎంపిక కోసం ఇంటర్వ్యూలు కూడా మొదలు కాబోతున్నాయి. ట్రంప్ వ్యాపార మండలి నుంచి 2017 ఆగస్టులో చాలామంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు వెళ్లిపోయిన తర్వాత అందులో ఇంద్రా నూయి చేరారు. కానీ, 2016 అమెరికా అధ్యక్ష ఎన్నిక సందర్భంగా నూయి బహిరంగంగా ఎవరికీ మద్దతు పలకలేదని, అందువల్ల ఆ విషయం ఆమె నామినేషన్‌కు ఒక అడ్డంకి కావచ్చని కూడా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ గెలిచిన తర్వాత కూడా ఆమె ఆయనకు వ్యతిరేకంగా కొన్ని వ్యాఖ్యలు చేశారు. తమ ఉద్యోగులందరూ ఏడుస్తున్నారని అన్నారు. తెల్లవారు కానివాళ్లు, మహిళలు, ఎల్జీబీటీలు.. ఇలా అందరూ 'మేం సురక్షితమేనా' అని అడుగుతున్నారని, ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తామెప్పుడూ భావించలేదని చెప్పారు. అయితే, ఆమె వ్యాఖ్యలను తప్పుగా ప్రచురించారని ఆ తర్వాత పెప్సికో ప్రతినిధి అన్నారు. ఎన్నికల ఫలితాల గురించి కొంతమంది ఉద్యోగుల అనుమానాలను మాత్రమే ఆమె చెప్పారని, అంతే తప్ప ఉద్యోగులందరి అభిప్రాయం అదేనని ఎప్పుడూ అనలేదని స్పష్టం చేశారు. ప్రపంచబ్యాంకు పదవి రేసులో ఇంకా అంతర్జాతీయ వ్యవహారాల ట్రెజరీ అండర్ సెక్రటరీ డేవిడ్ మాల్‌పాస్, విదేశీ ప్రైవేటు పెట్టుబడుల కార్పొరేషన్ ప్రెసిడెంట్ రే వాష్‌బర్న్ తదితరులు కూడా ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు నేరుగా ప్రపంచ బ్యాంకు చీఫ్‌ను నియమించలేరు గానీ, సంప్రదాయికంగా మాత్రం ఆయన చెప్పినవారికే ఆ పదవి దక్కుతూ వస్తోంది.

మూడుతరాల ముచ్చట



నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాలు

తిరుపతి, జనవరి 16: సంక్రాంతి పండుగను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి తన సొంతూరైన నారావారిపల్లెలో జరుపుకొన్నారు. నారా.. నందమూరి కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి పండుగను ఆస్వాదించారు. తన కుమారుడు, మంత్రి లోకేశ్, మనవడు దేవాన్ష్‌లతో కలిసి ఊరంతా తిరిగిన ముఖ్యమంత్రి చాలా కాలం తర్వాత మళ్లీ ఉల్లాసంగా కనిపించారు. ఇటీవలి కాలంలో వరుసగా పోలవరం సమీక్షలు, ఢిల్లీ ప్రయాణాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి రావడం లాంటి పనులతో బిజీ అయిపోయిన ఆయన.. పండుగ సందర్భంగా తన పూర్తి సమయాన్ని కుటుంబ సభ్యులకే కేటాయించారు. ముందుగా గ్రామ దేవత సత్యమ్మకు సకుటుంబ సమేతంగా పూజలు చేశారు. అక్కడి నుంచి అర కిలోమీటరు దూరం నడిచి వెళ్లి కులదేవత నాగలమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం మనుమడు దేవాన్ష్‌ని ఎడ్లబండిపై ఎక్కించుకుని.. ముఖ్యమంత్రి తానే స్వయంగా బండిని తోలుతూ ఊరంతా చూపించారు. తనను చూసేందుకు వచ్చిన వేలాదిమందిని పలకరించారు. వినతులు స్వీకరించారు. దేశ విదేశాలలో ఎక్కడ ఉన్నా సంక్రాంతి పండుగకు తాను పుట్టిన ఊరు నారావారిపల్లెకు తప్పనిసరిగా హాజరయ్యే సీఎం చంద్రబాబు... తనయుడు, మనుమడిని కూడా తీసుకెళ్లి, పల్లెల్లో సంక్రాంతి కళ ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు చూపించారు.

అల్లుడి రథసారథ్యంలో బాలయ్య

అల్లుడు నారా లోకేశ్ ట్రాక్టర్ నడుపగా మామ బాలయ్య, మనుమడు దేవాన్ష్ ట్రక్కులో నిలుచుని అందరికీ అభివాదం చేశారు. కనుమ సందర్భంగా బుధవారం పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నారావారిపల్లె వీధిలో ట్రాక్టర్ నడిపారు. అనంతరం తనను చూసేందుకు వచ్చిన ప్రజలను పలకరించి వినతులు స్వీకరించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. అంతా స్వగ్రామాలకు చేరుకుని ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ వేడుకలలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు దంపతులు, మంత్రి నారా లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు, ఎన్టీఆర్ కుమార్తెలు లోకేశ్వరి, ఉమామహేశ్వరి, తనయుడు రామకృష్ణ, వారి కుటుంబసభ్యులు, హీరో నారా రోహిత్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నుకుందాం

స్పీకర్ పదవిపై సీఎం ప్రతిపాదన , ఉత్తమ్,లక్ష్మణ్,ఓవైసీలకు

ఫోన్ ,ఓకే చెప్పిన ఎంఐఎం,బీజేపీ,చర్చించి చెప్తామన్న కాంగ్రెస్

హైదరాబాద్, జనవరి 16, (మనం ప్రతినిధి) : అసెంబ్లీ స్పీకర్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తంకుమార్ రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడారు. స్పీకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ప్రతిపాదించారు. సీఎం ప్రతిపాదనకు ఎంఐఎం, బీజేపీ అధ్యక్షులు వెంటనే అంగీకారం తెలిపారు. పార్టీలో చర్చించి గురువారం ఉదయం తమ నిర్ణయం ప్రకటిస్తామని పీసీసీ అధ్యక్షుడు బదులిచ్చారు.

నేడు సీఎల్పీ సమావేశం

పరిశీలకుడుగా కేసీ వేణుగోపాల్

హైదరాబాద్, జనవరి16(మనంప్రతినిధి) : కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) సమావేశం గురువారం ఉదయం 9 గంటలకు జరగనుంది. శాసనసభలోని సీఎల్పీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి పరిశీలకుడిగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ హాజరుకానున్నారు. శాసనసభ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నందున సీఎల్పీ నాయకుడిని ఈ సమావేశంలో ఎన్నుకుంటారు. ఎన్నికల్లో 19 మంది శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ పదవికై గతంలో డిప్యూటి స్పీకర్, చీఫ్ విప్‌గా పని చేసిన మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రిగా పని చేసిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కొత్తగా శాసనసభకు ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీ పడుతున్నారు. సీఎల్పీ నాయకుడి ఎంపికపై బుధవారం రాత్రి ఏఐసీసీ కోర్ కమిటీ ఢిల్లీలో సమావేశమైంది. సీఎల్పీ చీఫ్‌గా మల్లు భట్టి విక్రమార్కకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

దేవుడి దయ ఉంటే ముఖ్యమంత్రి అవుతాను

జగన్, టీఆర్ఎస్ కలవడం నాకు బహుమతి వంటిది

175 అసెంబ్లీ, 25 పార్లమెంటు సీట్లలో పోటీ చేస్తాం

పవన్, జేపీలను మా పార్టీలోకి ఆహ్వానిస్తున్నా

లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తమ్మీద బీజేపీకి 100 లోపే

సెక్యులర్ ఫ్రంటే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

హైదరాబాద్, జనవరి16(మనంప్రతినిధి) : దేవుడి దయ ఉంటే తాను ఏపీ సీఎంను అవుతానని, అయినా, ముఖ్యమంత్రి పదవి చాలా చిన్నదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చెప్పారు. బుధవారం ఇక్కడ ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో మహాకూటమిగా కాంగ్రెస్‌తో చేతులు కలిపి చంద్రబాబు కాంగ్రెస్ పుట్టిముంచారని , అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో టీఆర్ఎస్ పార్టీ వైసీపీతో చేతులు కలపడంతో జగన్ పార్టీ ఓడిపోవడం తథ్యమన్నారు. జగన్‌తో ఈ రోజు కేటీఆర్ కలిసి చర్చలు జరపడం ప్రజాశాంతి పార్టీకి న్యూ ఇయర్ గిఫ్ట్ ఇచ్చినట్లుగా ఉందని పాల్ వ్యాఖ్యానించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌లను ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వారు తమ పార్టీలో చేరితే త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరకపోతే కలిసిపోటీ చేద్దామని , జనసేనకు 10,15 సీట్లు ఇస్తామన్నారు. కాపుల ఓట్లు చీలకుండా తనతో పవన్ కళ్యాణ్ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో సంస్థాగతంగా తమ పార్టీ బలంగా లేకపోవడంతో పోటీ చెయ్యలేకపోయామని, ఈ సారి జరిగే ఎన్నికల్లో 175 శాసనసభ, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసి తీరుతామన్నారు. గ్రామం,మండలం, జిల్లాల్లో తమ కోఆర్డినేటర్లు ఉన్నారని, ఇంకా విస్తరిస్తున్నట్లు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 125, కాంగ్రెస్ 100 లోపుసీట్లు మాత్రమే గెలుస్తాయని జోస్యం చెప్పారు. ఎన్‌డిఎ, యూపీఏ ప్రభుత్వాలు అధికారంలోకి రావని, సెక్యూలర్ ఫ్రంట్ అధికారంలోకి వస్తుదని, మాయవతో, మమతా బెనర్జీయో మరోనేతో ప్రధాని కాబోతున్నారని చెప్పారు. రాహుల్ పీఎం కారనీ, మోడీ మరోమారు ప్రధాని కారని పేర్కొన్నారు. తనకు ప్రాణహాని ఉందని, తన ప్రాణాలకు ముప్పు ఏర్పడితే అందుకు చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.అయినా, దేవుడు తనను తీసుకుపోవాలనుకున్నప్పుడే వెళతానని అన్నారు.

నేడు లండన్‌కు జగన్

హైదరాబాద్, జనవరి 16: వైసీపీ అధినేత, ఏపీ ప్రధాన ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లండన్‌కు వెళ్లనున్నారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి జగన్ కుటుంబంతో కలిసి హైదరబాద్‌కు బయల్దేరనున్నారు. ఐదు రోజుల పాటు లండన్‌లోనే ఆయన గడపనున్నారు. పర్యటన ముగించుకుని ఈ నెల 22వ తేదీ రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్నారు జగన్ కుమార్తె వర్ష లండన్‌లో చదువుకుంటున్న సంగతి తెలిసిందే. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆమె విద్యాభ్యాసం చేస్తున్నారు. దీంతో.. కుమార్తెను చూసేందుకు కుటుంబసమేతంగా జగన్ లండన్ వెళ్తున్నారు. ఇటీవలే జగన్ ఏడాదిపాటు ఏపీలో 'ప్రజా సంకల్ప యాత్ర' ముగించుకున్న ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

యూపీఎస్సీ ద్వారానే డీజీపీలు

వారిని అలాగే నియమించాలి: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 16: సుప్రీంకోర్టులో రాష్ట్రాలకు చుక్కెదురైంది. రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ ను యూపీపీఎస్సీ ద్వారా కాకుండా తాము సొంతంగా కమిటీ ద్వారా నియమించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు కోరగా సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ రాష్ట్రాల పిటిషన్లను బుధవారం తోసిపుచ్చింది. డీజీపీలను రాష్ట్రాలు తమ సొంత చట్టాల ద్వారా నియమించుకునేందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. పోలీసు శాఖ రాష్ట్రానికి సంబంధించిన అంశమని, కాబట్టి దీని అధిపతిని తామే నియమించుకుంటామని ఇప్పటివరకు అన్ని రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుత కేసులో ధర్మాసనానికి నేత త్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ డీజీపీల ఎంపికపై సుప్రీం కోర్టు గతంలోనే ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. డీజీపీల ఎంపిక విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశమని, రాజకీయ జోక్యం నుంచి పోలీసు శాఖను రక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు.

రాహుల్ వల్లే కూటమికి దూరం

ఆర్జేడీ నేతల అవినీతిపై మాట్లాడలేదు

పట్నా, జనవరి 16: రాహుల్ గాంధీ వల్లే తాను మహాకూటమి నుంచి బయటకు వచ్చానని తెలిపారు బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్. ఈ విషయం గురించి నితీష్ కుమార్ మాట్లాడుతూ.. 'ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ మీద వచ్చిన అవినీతి ఆరోపణల పట్ల రాహుల్ గాంధీ ఒక స్టాండ్ తీసుకోలేకపోయారు. అవినీతి, నేరాలు, మతోన్మాదం వంటి అంశాలను నేను ఎన్నటికి అంగీకరించను. ఆర్జేడీ విధానాలు ఇలాంటి వాటిని పెద్దగా పట్టించుకోవు.

కోర్టుకు వోతం

- మాపై వేటు వెయ్యడం అప్రజాస్వామికం
- ఇది చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడవే
- ఏ గుర్తుపైనా పోటీచేయకున్నా అనర్హులా?
- పెద్దల సభలోనే అన్యాయం జరిగితే ఎట్ల
- మండలి ఛైర్మన్..పార్టీకో నీతి పాటిస్తారా?
- మా సత్తా చూపుతామని హెచ్చరిస్తున్నాం
- అనర్హతకు గురైన ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, యాధవరెడ్డి, రాములు నాయక్



హైదరాబాద్, జనవరి16(మనంప్రతినిధి) : తమపై అనర్హత వేటు వెయ్యడం అప్రజాస్వామికమని, ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అనర్హత వేటుపడ్డ ఎమ్మెల్సీలు యాధవరెడ్డి, భూపతిరెడ్డి, నాయక్ చెప్పారు. తమపై అనర్హత వేటు వేసిన విషయం మీడియాద్వారానే తెలిసిందని, కౌన్సిల్ చైర్మన్ ఉత్తర్వులు ఇంకా చూడలేదని తెలిపారు. టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్సీలపై బుధవారం శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ అనర్హత వేటు వేశారు. తమపై తీసుకున్న చర్యలపై ముగ్గురు ఎమ్మెల్సీలు వేర్వేరుగా స్పందించారు. భూపతిరెడ్డి మాట్లాడుతూ, ఈ రోజు చీకటిరోజుగా వ్యాఖ్యానించారు. తమపై అనర్హత వేటు వెయ్యడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడమేనని అభివర్ణించారు. తాను గవర్నర్ నామినేటెడ్ సభ్యుడిని కానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని, ఏ గుర్తుపై కూడా పోటీ చెయ్యలేదని, అలాంటప్పుడు అనర్హత వేటు వెయ్యడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తెరాసలో విలీనం అయినట్లు గెజిట్ విడుదల చేశారని, మళ్లీ కాంగ్రెస్ పార్టీ ఎలా ఉంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు ఎన్నుకుంటేనే స్వామిగౌడ్ చైర్మన్ అయ్యారని, పెద్దల సభలోనే న్యాయం జరగనప్పుడు ఇంకెక్కడ న్యాయం జరుగుతుందని భూపతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. యాధవరెడ్డి మాట్లాడుతూ, తమపై వేటు వెయ్యడం తీర్పు ముందు రాసుకున్నట్లుందని ఆరోపించారు. తాను పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడలేదని, అధికార పార్టీకి ఒక విధంగా విపక్ష పార్టీలకు మరొక విధంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లినవారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాములు నాయక్ మాట్లాడుతూ, తమపై అనర్హత వేటు వెయ్యడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. న్యాయం కోసం కోర్టు తలుపులు తడతామన్నారు.

ఏపీపై పెత్తనానికి కేసీఆర్ యత్నం

- ఫెడరల్ ఫ్రంట్ పేరుతో జగన్‌తో భేటీ
- మంత్రి దేవినేని ఉమామహేహ్వరరావు

విజయవాడ, జనవరి 16: టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, వైకాపా అధినేత జగన్ భేటీపై ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పందించారు. ముగ్గురు మోడీలు ఆంధ్రప్రదేశ్‌పై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియాతో సమావేశంలో ఉమా మాట్లాడుతూ.. ఏపీకి చెందిన ఆస్తుల పంపకాల్లో కేసీఆర్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ''ఏపీ భవన్, ఢిల్లీ, హైదరాబాద్‌లో ఆస్తులపై అడ్డుపడుతున్నారు. హైదరాబాద్‌లో సీమాంధ్రులు ఎప్పటికైనా కిరాయిదారులేనని కేసీఆర్ అన్నారు. ఆంధ్రావాళ్లు పన్ను ఎగ్గొడతారు.. దొంగలు అని కేసీఆర్ చెప్పారు. లంకలో పుట్టిన వాళ్లు అందరూ రాక్షసులే.. ఆంధ్రావాళ్లు కూడా అంతే అన్నారు. తెలుగుతల్లి మా తల్లే కాదు. . తెలుగుతల్లి మా పాలిట దెయ్యమన్నారు. రికార్డింగ్ డ్యాన్స్ సంస్కృతి ఆంధ్రా వాళ్లదని కేసీఆర్ చెప్పారు. ఆంధ్రాపోలీసులు మీకు పనికిరారు..న్యాయం చేయరు. జగన్‌కు ఆంధ్ర పోలీసులు వద్దు.. తెలంగాణ పోలీసులు ముద్దు. కవిత సహా తెరాస నాయకులు పోలవరం ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలవరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టులో కేసులు వేశారు. ఇప్పటికీ సుప్రీంకోర్టు, ఎన్జీటీలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒడిశాతో చేతులు కలిపి చేయని కుట్రలు లేవు. రాష్ట్రానికి తెలంగాణ రూ.5200 కోట్లు విద్యుత్ బకాయిలను చెల్లించాలి. పోలవరం ప్రాజెక్టు 62శాతం పూర్తయితే.. పునాదులు కూడా కాలేదంటున్నారు. ఏడు ముంపు మండలాలు ఏపీలో కలిపితేనే సీఎంగా ప్రమాణం చేస్తానని చంద్రబాబు చెప్పారు'' అని ఉమా గుర్తు చేశారు. జగన్ మోహన్‌రెడ్డి తెరాసతో చేతులు కలిపి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ జగన్‌ను రిమోట్‌కంట్రోల్‌గా వాడుకుని ఆంధ్రప్రదేశ్‌పై పెత్తనం చేయాలని చూస్తున్నారని ఉమా ఆరోపించారు.

అది మోదీ పప్పెట్స్ ఫ్రంట్ : యనమల

అమరావతి, జనవరి 16: టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి భేటీని ఏపీ మంత్రి యనమల రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. వారిది ఫెడరల్ ఫ్రంట్ కాదని మోదీ పప్పెట్స్ ఫ్రంట్ అని ఎద్దేవా చేశారు. ఇంకా చెప్పాలంటే బీజేపీ తోలు బొమ్మల ఫ్రంట్ అని, మోదీ చేతిలో కీలు బొమ్మల ఫ్రంట్ అని విమర్శించారు. ఓట్లను మోదీకి మూటగట్టడం కేటీఆర్, జగన్ భేటీలో కుతంత్రమని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ ఒకే వేదికపై వస్తున్నాయని తెలిపారు. బీజేపీ వ్యతిరేక పార్టీలను అడ్డుకొనేందుకు ఇది ఫ్రంట్ ఎత్తుగడగా అభివర్ణించారు. ఇంతకాలం వారి మధ్యనున్న చీకటి ఒప్పందం బహిర్గతమైందని యనమల పేర్కొన్నారు.

చీకటి ఒప్పందం బహిర్గతం

మోదీతో కలిసి మిలాఖత్: నారా లోకేశ్

అమరావతి, జనవరి 16: ఆంధ్రాకు రావాల్సిన వాటా దక్కకుండా చేస్తున్న కేసీఆర్‌తో జగన్ జట్టు కట్టారని ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. కేసీఆర్‌తో కలిసి జగన్ ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. దిల్లీ మోదీ, ఆంధ్రా మోదీ, తెలంగాణ మోదీ ఒక్కటయ్యారని ఎద్దేవా చేశారు. ఇంతకాలం వారి మధ్యన ఉన్న చీకటి ఒప్పందం ఇప్పుడు బహిర్గతమైందని పేర్కొన్నారు. ఆంధ్రాలో పుట్టిన వారంతా రాక్షసుల వారసులని కేసీఆర్ అవమానించారని, ఆంధ్రా బిర్యాని పేడలా ఉంటుందని అవహేళన చేశారని లోకేశ్ గుర్తుచేశారు.

టీఆర్ఎస్‌తో పొత్తు లేదు..

సొంతంగా పోటీ చేసే సత్తా మాకుంది.. : వైసీపీ

విజయవాడ, జనవరి 16, మనం ప్రతినిధి: వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడం లేదని వైసీపీ స్పష్టంచేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే సత్తా జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉందని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పేర్కొన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మార్గం సుగమం చేస్తూ.. అత్యధిక పార్లమెంట్ స్థానాలు సాధించేందుకు తమ పార్టీ కసరత్తు చేస్తోందని ఆయన అన్నారు. టీఆర్ఎస్, వైసీపీ పార్లమెంటు సభ్యులు కలిసి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం పోరాడేలా తమ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నట్టు అంబటి వివరించారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం చర్చలు జరిపితే కూడా టీడీపీ గగ్గోలు పెడుతోందని ఆయన మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం ధర్మం అని కేసీర్ చెబుతున్నపుడు వారితో సంప్రదించడం తప్పా అంటూ అంబటి ప్రశ్నించారు. కేసీఆర్ ఆహ్వానం..కేటీఆర్ చర్చలకు రావడం అన్నీ మంచి రాజకీయ పరిణామాలుగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఫెడరల్ ఫ్రంట్ బలమైన శక్తిగా రూపుదిద్దుకుంటుందేమోనన్న ఆలోచనతోనే చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా రానున్న మూడవ కూటమిని చంద్రబాబు ఎందుకు ఆహ్వానించలేకపోతున్నారని వైసీపీ ప్రశ్నించింది. దేశంలో జాతీయ పార్టీలు బలహీనపడి, ప్రాంతీయ పార్టీలు బలడతున్న ప్రస్తుత తరుణంలో ప్రాంతీయ పార్టీలన్నీ ఒక తాటిపైకి రావడం గొప్ప పరిణామంగా వైసీపీ అభివర్ణించింది. రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వాల్ని దెబ్బతీసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తుంటారని ఆరోపించిన వైసీపీ ఇందులో భాగంగానే షర్మిలపై సోషల్ మీడియాలో అపవాదులు వేస్తున్నారన్నారు.

ఎయిర్‌పోర్టులోకి కత్తి ఎలా వచ్చింది?

శ్రీనివాసరావుకు ఎన్ఐఏ ప్రశ్నల వర్షం



హైదరాబాద్, జనవరి 16:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఐదోరోజు విచారించింది. నిందితుడి విచారణ న్యాయవాదుల సమక్షంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఐదోరోజు విచారణలో భాగంగా నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును న్యాయవాది సలీం సమక్షంలో విశాఖపట్నంలోని కైలాసగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విచారించారు. శ్రీనివాస్ 20 మంది యువతులతో మాట్లాడిన కాల్ డేటా వివరాలపై ఎన్ఐఏ అధికారులు ప్రశ్నించారని న్యాయవాది సలీం తెలిపారు. 'ఎయిర్‌పోర్టులోకి కత్తి ఎలా వచ్చింది. ఎవరు తెచ్చారు' అనే అంశాలపై శ్రీనివాస్‌కు ప్రశ్నించారని పేర్కొన్నారు. శ్రీనివాస్ కాల్ డేటాను అధికారులు పరిశీలించారని చెప్పారు. మిగిలిన రెండు రోజులు శ్రీనివాస్‌ను ఎక్కడ విచారస్తారనేది ఎన్ఐఏ ఇంకా చెప్పలేదని సలీం బుధవారం మీడియాకు చెప్పారు. కాగా, వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన రోజు ఎయిర్ పోర్ట్ లాంజ్ వద్ద ఉన్న ఇద్దరి వ్యక్తుల నుంచి ఎన్ఐఏ అధికారులు వివరాలు సేకరించినట్టు సమాచారం.

ఎన్‌టీఆర్.. యుగపురుషుడు

18న భారీ విగ్రహం ఆవిష్కరణ ఏర్పాట్లను

పరిశీలించిన స్పీకర్ కోడెల



గుంటూరు, జనవరి 16: ఎన్‌టీఆర్ యుగ పరుషుడని, తెలుగుజాతి ఉన్నంతకాలం ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుందని స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు పేర్కొన్నారు. జనవరి 18 అన్న ఎన్టీయార్ వర్థంతి సందర్భంగా ఆయనకు నివాళిగా సత్తెనపల్లి పట్టణంలో రాష్ట్రంలోనే పెద్దదైన ఎన్టీఆర్ విగ్రహన్ని సీఎం చంద్రబాబునాయుడు ఆవిష్కరిస్తారిస్తారని చెప్పారు. సత్తెనపల్లిలో విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్‌టీఆర్ వర్థంతికి ప్రతి సంవత్సరం అన్నదానం, రక్త దానం వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఎన్టీయార్ పెట్టిన సంక్షేమ పథకాలే దేశంలో ఎక్కువ ప్రభుత్వాలు నేటికి అమలు చేస్తున్నాయని చెప్పారు. సత్తెనపల్లిలో విశాలమైన చెరువులో అన్న ఎన్టీయార్ విగ్రహం ఏర్పాటు చేయనున్నామన్నారు. గతంలో మురికి కూపంలాగా ఉన్న ఆ చెరువును మరమ్మతులు చేసి 40అడుగుల పీఠంపై 36అడుగుల ఎన్టీయార్ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. అలాగే చెరువులో ఎనిమిది అడుగుల నీటిని నింపుతామని చెప్పారు. విగ్రహం చూడడానికి విగ్రహం దగ్గర గ్యాలరీ ఏర్పాటు చేస్తామని, బోటింగ్ సౌకర్యాలు కూడా నెలకొల్పుతామని చెప్పారు. సీఎం చంద్రబాబు, సీఆర్డీఏ సహకారంతో సత్తెనపల్లిని అభివృద్ధి చేస్తున్నామని చప్పారు. ఈ నెల 18న సీఎం చంద్రబాబుగారు ఉదయం 10గంటలకు ఎన్టీయార్ విగ్రహం, పార్క్ ను ప్రారంభించనున్నారని చెప్పారు. అలాగే.. రూ. 35 కోట్లతో కేంద్రీయ విద్యాలయ భవనాలకు, సత్తెనపల్లి- అచ్చంపేట మధ్య రూ. 90కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తామన్నారు. కోడమోడు నుండి పేరెచర్ల వరకూ రోడ్డు పూర్తియితే సత్తెనపల్లి జీవనరేఖ మారిపోతుందని స్పీకర్ పేర్కొన్నారు. కాగా, కోటప్పకొండలో ఈ నెల 19, 20న నిర్వహించే హిల్ ఫెస్టివల్ ఏర్పాట్లను కూడా స్పీకర్ పరిశీలించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అరకులో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

ఈ నెల 18 నుండి 20 వరకు నిర్వహణ

15 దేశాల 20 బెలూన్లతో బెలూన్ ఫెస్టివల్

మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి





విశాఖపట్నం, జనవరి 16: ఈ నెల 18 నుండి 20 వరకు మూడు రోజుల పాటు అరుకులో అంతర్జాతీయ హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివ ద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం ఒక ప్రైవేట్ హోటల్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తో కలసి మంత్రి పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది అరుకులో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహించామని, అదే తరహాలో ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఫెస్టివల్ లో మొత్తం 15 దేశాలకు చెందిన 20 బెలూన్ లతో టీములు పాల్గొన్నట్లు తెలిపారు. బ్రెజిల్, స్లోవేకియా, ఇటలీ, యూకే, థాయిలాండ్ , ఫ్రాన్స్, స్పెయిన్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా 15 దేశాల ప్రతినిధులు ఈ ఫెస్టివల్ లో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. బేబీ కార్ హ్యాపీ చికెన్ వంటి పలు ఆకృతులతో కూడిన బెలూన్లు నీలి మేఘాల నడుము కదులుతూ ఆకర్షణగా నిలుస్తాయి అన్నారు. ఈ బెలూన్‌లలో విహరించేందుకు ఇప్పటికే సుమారు నాలుగు వేల మంది పేర్లను ఆన్లైన్లో నమోదు చేసుకున్నారు. ఇటువంటి అంతర్జాతీయ ఫెస్టివల్స్ నిర్వహించడం ద్వారా విశాఖ పర్యాటక అందాలు ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రాచుర్యాన్ని పొందుతాయి ఆయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరిచి పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించాలనే లక్ష్యంతో గత నాలుగున్నరేళ్ల లో రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫలితంగా గత ఏడాది ఒక కోటి 96 లక్షల మంది పర్యాటకులు విశాఖ జిల్లాకు రాగ, ఈ ఏడాది ఇప్పటివరకు రెండు కోట్ల 30 లక్షల మంది పర్యాటకులు జిల్లాను సందర్శించాబు అన్నారు. ప్రత్యేకంగా పర్యాటక క్యాలెండర్ ను రూపొందించి ప్రణాళికాబద్ధంగా పలు ఈవెంట్లను అమలుపరచడం జరుగుతుందన్నారు. విశాఖ జిల్లాలో పలు బుద్ధిజం సర్క్యూట్లు ఉన్నాయని, వాటిని 20 కోట్ల అంచనా వ్యయం తో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. బౌద్ధ పర్యాటకులను పెద్ద ఎత్తున జిల్లాకు వచ్చేలా కాలచక్ర తరహాలో ఒక ఫెస్టివల్ను నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అరుకులో ఏకో టూరిజం అభివ ద్ధికి 156 కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేశామన్నారు. విశాఖను పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ పర్యాటక పరంగా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎన్నో కార్యక్రమాలను గత నాలుగున్నర ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. 2014లో 9 కోట్ల 84 లక్షల మంది పర్యాటకులు రాష్ట్రానికి రాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 19 కోట్ల మంది వచ్చారని ఆయన అన్నారు. పర్యాటక శాఖ ఆర్ డి రాధాక ష్ణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి పూర్ణిమ దేవి, ఈ ఫ్యాక్టర్ ప్రతినిధి సుమిత్, పలు దేశాల నుంచి వచ్చిన బెలూన్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
గురువారం, జనవరి 17

'ఆపరేషన్ సంక్రాంతి'

ఓడినా మాదే పైచేయి కావాలనే వాదానికే పాఠాలు నేర్పేందుకు బీజేపీ శతవిధాల కసరత్తులు చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పనులకు నిర్లజ్జగా శ్రీకారం చుడుతున్న పాలకపక్షం కుయుక్తులు కర్ణాటకతో పాటు మధ్యప్రదేశ్‌లోనూ అద్దంలో ప్రతిమల్లా కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. ఈ రాజకీయ క్రీడతో నేతిబీరకాయలో నెయ్యి చందంలా బీజేపీ నిత్యం పఠించే ప్రజాస్వామ్య మంత్రంలో ఏమాత్రం పవిత్రత కనిపించడం లేదు. కర్ణాటకలో గతంలో బోర్లపడినప్పటికీ పాఠం నేర్చుకున్న దాఖలాలు బీజేపీ నేతల్లో కానరావడం లేదు. దానికి తోడు మధ్యప్రదేశ్‌లో బీజేపీని ఓడించి కాంగ్రెస్ అధికారాన్ని స్వీకరించి నెలరోజులు పూర్తికాకముందే ప్రజాస్వామ్యాన్ని కూల్చేందుకు బీజేపీ యత్నాలు ప్రారంభించిందని వార్తలు వస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల ఆకాంక్షాలు తీర్చడంలో ఘోరంగా విఫలమైన నేపథ్యంలో గతంలో ఉన్న రాష్ట్రాలను ఒక్కొటొక్కటి బీజేపీ కోల్పోతోంది. ఒకప్పుడు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రజలు బీజేపీ వైఫల్యం కారణంగా మళ్లీ కాంగ్రెస్ బలం పుంజుకుంటోందనేది ఇటీవల ఎన్నికలు రుజువుచేశాయి. కర్ణాటకలో మొదలైన బీజేపీ పతనం గుజరాత్‌లో చావుతప్పి కన్ను లొట్టపోయినట్టుగా స్వల్ప మెజారిటీతో గట్టెక్కగలిగింది. అనంతరం ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టు విధంగా తయారై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

ఎలాగైనా అధికారాన్ని విపక్షానికి దక్కకుండా చూడాలని కర్ణాటకలో యడ్యూరప్ప నాయకత్వంలో చేసిన ప్రయోగం వికటించి దేశవ్యాప్తంగా నవ్వులపాలైంది. అయినా కర్ణాటక బీజేపీ నాయకుల్లో ఉన్న అధికారం దాహానికి ఆజ్యం పోసేలా అడపాదడపా జేడీఎస్-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని కుదురుగా పాలన చేయనీయకుండా చేయాల్సిన కుట్రలు, కుతంత్రాలకు ఢిల్లీ అధికార యంత్రాంగం అంతులేకుండా పోతోందని కర్ణాటక రాజకీయ క్రీడలు స్పష్టంచేస్తున్నాయి. కుమారస్వామి పగ్గాలు చేతపట్టిన మరుక్షణం నుంచి ఎలాగైనా కూటమి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే యత్నాలు బీజేపీ అధిష్టానం చేయని ఆలోచన లేదు. కాంగ్రెస్ నేత శివకుమార్‌పై సీబీఐని ఉసిగొల్పి దాడులు చేయించడం దగ్గర నుంచి కొంతకాలం జేడీఎస్ శాసనసభ్యులకు గాలం వేసే ప్రయత్నాలు విఫలం కావడంతో అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో ఎదురైన ఓటమితో ప్రజల్లో మరింత అభాసుపాలైంది. కానీ, మళ్లీ మరోసారి కర్నాటకానికి తెరతీయాలని చేస్తున్న ప్రజాస్వామ్య హనన చర్యలతో కొద్దోగొప్పో దక్షిణాదిలో బీజేపీ పట్ల కర్ణాటక ప్రజల్లో ఉన్న అభిమానాన్ని కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నా అధికారమే పరమావధిగా కర్ణాటక బీజేపీ నేతల వైఖరి ఉన్నది. ఇందుకు తార్కాణం ప్రభుత్వాన్ని అస్థిర పరిచే చర్యలకు ఈసారి ముంబై కేంద్ర బిందువుగా మారింది. ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఇద్దరు ఇండిపెండెంట్లను ఆకర్షించడంలో బీజేపీ కృతకృత్యమైనట్టే కనిపిస్తోంది. మరికొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కూడా గాలం వేసినట్టు వస్తున్న వార్తల్లో నిజమే ఉన్నట్టు పరిస్థితులు రుజువుచేస్తున్నాయి. ఏడు నెలల సంకీర్ణకూటమి ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఇద్దరు ఇండిపెండెంట్లు సహా ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముంబైలోని ఒక హోటల్‌లో బీజేపీ ఆశ్రయం కల్పించినట్లు సమాచారం. మరో ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా దర్శనం కోసం పడిగాపులు పడుతున్నారు. 'ఆపరేషన్ సంక్రాంతి' పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ఈ చర్యలు బీజేపీకి తాత్కాలికంగా ప్రయోజనం కలిగించవచ్చునేమోగానీ, ప్రజల నుంచి శాశ్వతంగా దూరం చేస్తాయనడంలో సందేహం అక్కరలేదు. కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ జరిగిన క్షణం నుంచి బీజేపీ ఈ ఆపరేషన్‌కు తగిన ఏర్పాట్లు చేస్తూనే ఉన్నది. అసలు మంత్రివర్గ విస్తరణ కార్యక్రమాన్ని లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకు వాయిదా వేద్దామని జేడీఎస్ అధినేత దేవెగౌడ చేసిన సూచనను పార్టీలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తిరస్కరించారు. దాంతో మంత్రివర్గంలో స్థానం ఆశించిన కాంగ్రెస్ నేతల్లో కొంతమందిలో అసంతృప్తికి కారణమైంది. ఇది బీజేపీకి అనుకోని అవకాశం కల్పించినట్లయింది. కర్ణాటకలో ప్రస్తుత పరిస్థితుల చూస్తుంటే కూటమి ప్రభుత్వాన్ని ఎలాగైనా కూల్చేందుకు చివరి నిమిషం వరకు కుతంత్రాలకు పాల్పడడం ద్వారా బీజేపీ స్థిమితంగా ఊరుకోదని వెల్లడవుతోంది. ఏ పార్టీకి సాధారణ మెజారిటీ లభించని మధ్యప్రదేశ్‌లో బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన ఇద్దరు, మరో నలుగురు ఇండిపెండెంట్ల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దాంతో కర్ణాటకలో చేస్తున్నట్టుగా మధ్యప్రదేశ్‌లో కూడా ప్రభుత్వాన్ని ఎలాగైనా అస్థిరపరిచేందుకు చర్యలుచేపట్టాలని బీజేపీ కంకణం కట్టుకుందని రాజకీయ పండితులు భావిస్తున్నారు. దేశంలో ఒక్క బీజేపీ మినహా మరే ఇతర పార్టీ పాలనాపగ్గాలు చేపట్టరాదని బీజేపీ అన్ని రకాల ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందనడంలో సందేహం లేదు.

తమది భిన్నమైన పార్టీ అని, కాంగ్రెస్ తరహా సంప్రదాయ పార్టీ కాదని నిత్యం జపించే బీజేపీ అనుసరిస్తున్న పద్ధతులు ప్రజాస్వామ్య చట్రాన్ని ఏ విధంగాను బలపరచవు. రాజ్యాంగ విలువలను నిలబెట్టవు. గతంలో ఒకసారి కర్ణాటకలో ఎస్ఆర్ బొమ్మయ్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీ రామారావు హయాంలలో ఎదురైన అనుభవాలు బీజేపీని కొంతమేరకు కట్టడి చేస్తున్నాయిగానీ, లేకపోతే ఆ పార్టీ మరింత వేగంగా ప్రజాప్రభుత్వాలను కూల్చివేసేందుకు వెనుకాడదని స్పష్టమవుతోంది. ఎన్ని ఫిరాయింపుల నిరోధక చట్టాలు వచ్చినా, ఎన్ని కోర్టుల్లో తీర్పులొచ్చినా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పట్ల గౌరవం లేని పార్టీలకు, నేతలకు మనం సలాం కొడుతున్నంతకాలం గొంగట్లో అన్నం తింటూ వెంట్రుక లొస్తున్నాయని వాపోయినట్టే ఉంటుంది. ఏదైమైనా ఇందిర హయాం నుంచి ప్రజాస్వామ్యం గొంతుపై కత్తి వేలాడుతూనే ఉన్నది. ఎప్పటికప్పుడు ప్రజల చైతన్యంతో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతూనే ఉన్నది.



మంచిమాట



విజయం కలిగిందని విర్రవీగకు. అపజయం కలిగిందని నిరాశపడకు. ఎందుకంటే విజయం అంతం కాదు. అపజయం చివరి మెట్టు కాదు.

- స్వామి వివేకానంద

ఎదురులేని నేత ఎన్టీఆర్

ప్రపంచవ్యాప్తంగా అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే కోట్లాదిమందికి నెల్సన్ మండేలా ఒక ప్రతీకగా నిలిస్తే, ఆత్మగౌరవం అనే నినాదంతో తెలుగు ప్రజలకు ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఎదురులేని నేత ఎన్టీ రామారావు. ప్రజా జీవితంలో, సినీ జీవితంలో ప్రమాణాలు, విలువల గురించి చెప్పుకున్నప్పుడల్లా ప్రథమంగా గుర్తుకొచ్చే మహోన్నత వ్యక్తి ఆయన. నటనతో ప్రజలను రంజిపచేసినా... రాజకీయాల్లో కొత్తకోణాన్ని చూపించినా... అది ఎన్టీఆర్కే సాధ్యం. దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీల వ్యవస్థకు ప్రత్యేక స్థానాన్ని కల్పించిన చారిత్రక మూర్తిగా, తెలుగుదనపు తియ్యదనాన్ని జాతీయంగా, అంతర్జాతీయంగా చవిచూపించిన తెలుగు వల్లభునిగా చరిత్రలో నిలిచిపోయారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లని తలచి సంక్షేమ రాజ్యం సృష్టించి సమసమాజ నిర్మాతగా, లౌకికవాదిగా నందమూరి తారక రామారావు పేరు ప్రఖ్యాతులు పొందారు. నీతి, నిజాయితీ, నిరాడంబరత, నిస్వార్థం, నిబద్ధత, సాహసం, సమర్థత వీటన్నింటికి నిలువుటద్దం ఎన్టీఆర్'.

బాల్యం నుంచి రాజకీయ జీవితం వరకు ప్రతి అధ్యాయం నేటితరం యువతకు ఆదర్శనీయం. ఎన్నో వ్యయప్రయాసలతో సాగిన ఆయన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు దాటారు. మహానాయకుడిలా ప్రపంచ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని ఏర్పరచుకున్నారు. ఎన్టీఆర్ జీవనశైలి, మాటతీరు, ఎవరినైనా గౌరవప్రదంగా బ్రదర్ అని పలుకరించే తత్వం నేటి యువతకు అనుసరణీయం.

సామాన్య రైతు కుటుంబంలో జన్మించి సినీ కళా ప్రపంచంలో సాటిలేని నటునిగా 300కు పైగా చిత్రాల్లో నటించి దేశ వ్యాప్తంగా ప్రజల మనసులను కొల్లగొట్టారు నందమూరి తారకరామారావు. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో చదువుకుంటున్న సమయంలో నాటక సంఘాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు. ఆ సమయంలోనే నేషనల్ ఆర్ట్ థియేటర్ గ్రూప్ అనే నాటక సంస్థను స్థాపించి కొంగర జగ్గయ్య, ముక్కామల, కె.వి.ఎస్.శర్మ తదితరులతో 'చేసిన పాపం' వంటి ఎన్నో నాటకాలు ఆడారు. తర్వాతి కాలంలో ఈ సంస్థ కొన్ని చిత్రాలను కూడా నిర్మించింది. మంగళగిరిలో సబ్-రిజిస్ట్రారు ఉద్యోగం లభించినప్పటికీ సినిమాలలో చేరాలనే ఆసక్తితో ఆ ఉద్యోగంలో మూడు వారాలకంటే ఎక్కువ ఉండలేకపోయారు. ప్రముఖ నిర్మాత బి.ఎ.సుబ్బారావు ఎన్టీఆర్ ఫొటోను ఎల్వీ ప్రసాదు దగ్గర చూసి, వెంటనే ఆయనను మద్రాసు పిలిపించి 'పల్లెటూరి పిల్ల' సినిమాలో కథానాయకుడిగా ఎంపిక చేశారు. దీనికి గాను రామారావుకు వెయ్యి నూటపదహార్ల పారితోషికం లభించడంతో ఆయన తన సబ్-రిజిస్ట్రారు ఉద్యోగానికి రాజీనామా చేశారు. కానీ సినిమా నిర్మాణం వెంటనే మొదలవలేదు. ఈలోగా 'మనదేశం' సినిమాలో అవకాశం రావడంతో దానిలో నటించారు. అందుచేత ఆయన మొదటిసారి కెమెరా ముందు నటించిన సినిమా 'మనదేశం' అయింది. ఆ తర్వాత ఆయన నటించిన ప్రతి చిత్రం నటుడిగా ఆయనకు గొప్ప కీర్తిని సంపాదించి పెట్టాయి. ఉంగరాల జుట్టుతో, స్ఫురద్రూపంతో, వెలుగులు విరజిమ్మే నవ్వుతో ప్రజలను ఆకట్టుకుని వారి మనసుల్లో నిలిచిపోయారు. 1956లో విడుదలైన మాయాబజార్‌లో ఆయన తీసుకున్న 7,500 రూపాయల పారితోషికం అప్పట్లోనే హైయస్ట్ రెమ్యూనరేషన్. సంవత్సరానికి 10 సినిమాల చొప్పున నటిస్తూ ఎన్టీఆర్ ఎంతో ప్రజాదరణ పొందిన నటుడిగా ఎదిగాడు. 1963లో విడుదలైన లవకుశ అతి పెద్ద విజయాన్ని నమోదు చేసింది. మొట్టమొదటిసారి తెలుగు పూర్తిరంగుల సినిమాగా వచ్చిన సినిమా 'లవకుశ'. ఈ సినిమాకి సంబంధించిన మరొక విశేషం ఏమిటంటే ఈ సినిమా చూడటానికి ఎడ్ల బండి మీద వచ్చేవారు. ఒకవేళ టికెట్లు దొరక్కపోతే అక్కడే ఉండి వండుకొని తిని చూసి మరీ వెళ్లేవారట. ఎన్టీఆర్ స్వీయ దర్శకత్వంలో వచ్చిన తొలిచిత్రం 1961లో విడుదలైన 'సీతారామ కల్యాణం'. ఈ చిత్రాన్ని తన సోదరుడు త్రివిక్రమరావు ఆధీనంలోని నేషనల్ ఆర్ట్ ప్రొడక్షన్స్' పతాకంపై విడుదల చేశారు. రావణబ్రహ్మ తన అభిమాన పాత్రగా ఆ రోజుల్లో ఎన్టీఆర్ చెప్పుకున్నారు. ఆయన నటించిన సాంఘిక చిత్రాలు అడవిరాముడు, యమగోల బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించాయి. ఎన్టీఆర్ క్రమశిక్షణలో చాలా కచ్చితంగా ఉండేవాడు. గంభీరమైన స్వరాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ మద్రాసు మెరీనా బీచ్లో అభ్యాసం చేసేవారు. నర్తనశాల సినిమా కోసం ఆయన వెంపటి చినసత్యం దగ్గర కూచిపూడి నేర్చుకున్నారు. వృత్తిపట్ల ఆయన నిబద్ధత అటువంటిది. కెమెరా ముందు ఎన్టీఆర్ తడబడిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు.

> **విభిన్న పక్షాలను ఒక తాటిపైకి తెచ్చి 'నేషనల్ ఫ్రంట్' ఆవిర్భావానికి ఎన్టీఆర్ కృషి చేశారు. జాతీయ పార్టీల నాయకులను రప్పించి సదస్సులు నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయాన్ని రూపొందించారు. యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో, ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటులో తెలుగుదేశం పార్టీదే ప్రధాన భూమిక. సమకాలికుల్లో ఆయనంతటి ప్రజానాయకుడు మరొకరు లేరు. కాంగ్రెసుకు ఆంధ్రప్రదేశ్‌లో ధీటైన ప్రత్యామ్నాయాన్ని నిలబెట్టిన గొప్పదనం పూర్తిగా ఎన్టీఆర్‌దే.**


తెలుగుజాతికి ఖ్యాతిని పునర్జీవింపచేయడానికి తన 60వ ఏట రాజకీయ రంగప్రవేశం చేసి తెలుగు దేశానికి జీవంపోసి దేశ రాజకీయాల స్వరూపాన్నే మార్చేశారు. అట్టడుగు ప్రజల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ పునాది కావాలని ఆలోచించిన ఆదర్శప్రాయుడు. 1981లో ఊటీలో 'సర్దార్ పాపారాయుడు' చిత్రం షూటింగు విరామ సమయంలో ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. తన తర్వాత పుట్టిన రోజు నుంచి ప్రతి నెలలో 15రోజులు తెలుగుప్రజల సేవకోసం కేటాయిస్తానని చెప్పిన సమాధానం ఆయన చేయబోయే రాజకీయ ప్రయాణానికి మొదటి సంకేతం.

పార్టీ ప్రచారానికై తన పాత చవర్‌లెటు వ్యానును బాగుచేయించి, దానిని ఒక కదిలే వేదికగా తయారు చేయించి 'చైతన్యరథం'గా నామకరణం చేశారు. 'తెలుగుదేశం పిలుస్తోంది, రా! కదలి రా!!' అనే నినాదంతో రథయాత్ర సాగింది. ఆ తరువాతి కాలంలో భారత రాజకీయాల్లో పరుగులెత్తిన ఎన్నో రథాలకు ఈ చైతన్యరథమే స్ఫూర్తి. ప్రజలను చైతన్య పరుస్తూ చైతన్యరథంపై ఆంధ్రప్రదేశ్ నలుమూలలకూ ఎన్టీఆర్ ప్రచారయాత్రను సాగించారు. తదనంతరం చైతన్య రథమే ప్రచార వేదికగా, నివాసంగా మారిపోయింది. ఒక శ్రామికుడివలె ఖాకీ దుస్తులు ధరించి, నిరంతరం ప్రయాణిస్తూ, ఉపన్యాసాలిస్తూ ప్రజల హృదయాలను దోచుకున్నారు. కేంద్ర అధికారాన్ని కూకటివేళ్ళతో పెకలించివేసిన ప్రచార ప్రభంజనమది.

జాతీయ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, తరచూ ముఖ్యమంత్రులు మారుతూ ఉండటం, ముఖ్యమంత్రిని ఢిల్లీలో నిర్ణయించడం వంటి కారణాలతో విసిగి వేసారిన ప్రజలు నందమూరి తారక రామారావు నినాదం పట్ల ఆకర్షితులయ్యారు. 1983 జనవరి 7న విడుదలైన ఎన్నికల ఫలితాలలో 199 సీట్లతో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగించింది. 97 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెసు పార్టీ 9 నెలల తెలుగుదేశం పార్టీ చేతుల్లో చిత్తుగా ఓడిపోయింది. 1983 శాసనసభ ఎన్నికల్లో ఆయన సాధించిన విజయం ఆయన రాజకీయ జీవితంలో ఒక అపూర్వ ఘట్టం. 1984 ఆగస్టు 16న నాదెండ్ల భాస్కరరావు, అప్పటి గవర్నర్ రాంలాల్, ప్రధాని ఇందిరా గాంధీల లోపాయికారీ సహకారంతో రామారావును అధికారం నుంచి తొలగిండంతో తిరిగి రామారావు ప్రజల్లోకి వెళ్ళారు. జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు. ఫలితంగా సెప్టెంబర్ 16న రామారావును తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించడం కేంద్రప్రభుత్వానికి తప్పింది కాదు. నెలరోజుల్లోనే ఆయన ప్రభ తిరిగి శిఖరాగ్రానికి చేరింది.

ప్రభుత్వ ఖజానాకు ఎంత భారంపడినా ఎన్టీఆర్ తన హామీలను అమలు పరచడంలో ఎన్నడూ వెనుకడుగు వేయలేదు. నేడు తెలుగు రాష్ట్రాల్లోనే కాక, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న చాలా పథకాలకు ఎన్టీఆరే స్ఫూర్తి. ప్రజా సంక్షేమ పాలనకు బాటలు వేసి భారత రాజకీయ చరిత్రలో సంక్షేమ అధ్యాయానికి పేదల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. పేదలు కడుపునిండా తినాలనే ఉద్దేశంతో రెండు రూపాయలకే కిలో బియ్యం, నిలువ నీడలేని వారికి పక్కా ఇళ్లు, సగం ధరకే చేనేత వస్త్రాలు, నిరాధార పేద వితంతువులకు, కూలీలకు పింఛన్ల పంపిణీ, భూమిలేనివారికి భూవసతి, మురికివాడల్లోని పిల్లలకు పాల పంపిణీ వంటి వినూత్న పథకాలకు ఆయనే ఆది గురువు. ఆస్తిలో ఆడపిల్లలకు సమాన హక్కు, రెవెన్యూ మండలాల ఏర్పాటు. గ్రామీణులకు ఉపాధి కల్పించేందుకు గ్రామీణ క్రాంతి పథకం, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు తెలుగు మాతృదేవత పథకం, పేద పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు తెలుగు బాలల క్షీర సంక్షేమ పథకం, భూమిలేని పేదలకు మిగులు భూములను ఇచ్చే తెలుగు మాగాణి పథకం, వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్, ప్రభుత్వ కార్యాలయాలకు తెలుగులో పేర్లు, తెలుగుగంగ, ఆడపడుచుల ఉన్నత విద్య కోసం మహిళా విశ్వవిద్యాలయం, ప్రజా సదస్సులు, ఏకగవాక్ష విధానం వంటి ఎన్నో నూతన సంస్కరణలకు, పథకాలకు, ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు.

తెలుగుదేశం పార్టీకి ముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాల గుత్తాధిపత్యంలో ఉండేది. ఆ సమయంలో మిగతా కులాల వారికి తారక రామారావు ఆశాకిరణం లాగా కనిపించారు. ఎన్టీఆర్ మొట్టమొదటిసారి అన్ని కులాల వారికి, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలవారికి తెలుగుదేశం పార్టీలో ఉన్నత పదవులు కల్పించారు. అన్ని వర్గాలలోని యువతరానికి చెందిన సామాన్యులకు, విద్యావంతులకు, మహిళలకు పదవులను కేటాయించి రాజకీయాలను సామాన్యుల చెంతకు చేర్చారు. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు రాజ్యాధికారం కల్పించారు. ఎందరో కొత్తవారిని, బాగా చదువుకున్న వారిని రాజకీయాలకు పరిచయం చేసి, ఒంటిచేత్తో వారిని గెలిపించిన ప్రజానాయకుడు ఆయన. సరికొత్త తరాన్ని, వినూత్న సేవా సంస్కృతిని రాజకీయాల్లో ప్రవేశపెట్టిన భారత ప్రజాస్వామ్య దిక్సూచి ఎన్టీఆర్. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దే. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు మండల వ్యవస్థకు నాంది పలికి పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దుచేసి ప్రజలవద్దకే ప్రభుత్వాన్ని పంపించి గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. మూడంచెల పంచాయితీ రాజ్, స్థానిక సంస్థలకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించడం వంటి సంస్కరణలకు నాంది పలికారు. ఆయన చేసిన కృషి ఫలితంగా ఈనాటికి అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు.



విభిన్న పక్షాలను ఒక తాటిపైకి తెచ్చి 'నేషనల్ ఫ్రంట్' ఆవిర్భావానికి నందమూరి తారక రామారావు కృషి చేశారు. జాతీయ పార్టీల నాయకులను రప్పించి సదస్సులు నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయాన్ని రూపొందించారు. యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో, ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటులో తెలుగుదేశం పార్టీదే ప్రధాన భూమిక. సమకాలికుల్లో ఆయనంతటి ప్రజానాయకుడు మరొకరు లేరు. వటవృక్షం లాంటి కాంగ్రెసుకు ఆంధ్రప్రదేశ్‌లో ధీటైన ప్రత్యామ్నాయాన్ని నిలబెట్టిన గొప్పదనం పూర్తిగా ఎన్టీఆర్‌దే. పట్టుదలకూ, క్రమశిక్షణకు మారుపేరైన వ్యక్తి ఆయన. ఈ కారణాల వల్లనే కాంగ్రెసు పార్టీని ఎదుర్కొని స్థిరమైన ప్రభుత్వాన్నీ, ప్రభావవంతమైన ప్రతిపక్షాన్ని రాష్ట్ర ప్రజలకు ఇవ్వగలిగారు. తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తే శతాబ్దాల నాటి జాతీయ పార్టీ అయినా, నూతనంగా ఆవిర్భవించిన ప్రాంతీయ పార్టీలైనా సమాజానికి ఎన్టీఆర్ అందించిన ఎజెండానే అనుసరిస్తున్నాయి. అందుకే ప్రజానాయకుడిగా చరిత్రలో ఎన్టీఆర్ స్థానం సుస్థిరం. ఆయన కీర్తి అజరామరం.

◆ తాడికొండ సాయికృష్ణ
9866365222
(రేపు ఎన్టీఆర్ వర్ధంతి)

విజ్ఞానశాస్త్రమే దృష్టికావాలి

కర్నూలుకు చెందిన అధ్యాత్మిక వేత్త బాల సాయిబాబా మరణవార్త ఆయన భక్తులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆకట్టుకొనే ప్రసంగాలు, తమకు అతీంద్రీయ శక్తులున్నాయని ఇతరులను నమ్మించడం, రాజకీయ నాయకుల సహకారం, మీడియా ప్రచారం తదితర కారణాల వల్ల భారతదేశంలో బాబాలకు గిరాకీ పెరుగుతోంది. ఉదరంలో నుంచి నోటి ద్వారా శివలింగాన్ని తీయడమనే అంశంతో బాలసాయిబాబా ప్రాచుర్యం పొందారు. విదేశీ భక్తుల నుంచి అందే విరాళాలు, అధికారుల మద్దతు, ఆయన జన్మదినం నాడు చేసే సేవా కార్యక్రమాల వల్ల బాల సాయిబాబా పేరు గడించారు. భక్తుల చేత 'భగవాన్ బాలసాయిబాబా'గా పేరు పొందిన ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై తుదిశ్వాస విడిచారు. నేడు బాబాలుగా, స్వామీజీలుగా చలామణి అవుతున్న వారందరూ ఒకప్పుడు సామాన్య వ్యక్తులే. ప్రజల్లో దైవం పట్ల ఉన్న విశ్వాసాలే సామాన్యులుగా ఉన్నవారు సైతం బాబాలుగా అవతరించడానికి దోహదపడుతున్నాయి. చరిత్రలో అరవింద్ ఘోష్ వంటి వారు ఆధ్యాత్మిక మార్గం ద్వారా ఆశ్రమ జీవితం గడిపి విద్యాదానం చేశారు. భారతదేశానికి బ్రిటిష్ వారి నుంచి విముక్తి కల్గించడానికి కృషిచేశారు. తెలుగునాట స్వామి రామానంద తీర్థ కూడా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించి సమాజ శ్రేయస్సుని కాంక్షించారు. స్వామి వివేకానంద వంటి వారు 'మానవసేవయే మాధవసేవ' అన్నారు. ఎవరెనా తమకు అపారజ్ఞానం వుందని, గొప్ప బలం వుందని చెప్పుకోవడంలో తప్పులేదు. అయితే ఆ బలాన్ని ఆచరణలో చూపించాలి. 14వ శతాబ్దంలో ఫ్రాన్స్‌కి చెందిన జోన్ ఆఫ్ ఆర్క్‌కు కొన్ని కలలు వచ్చేవి. 'నేను దేవుని గొంతు విన్నాను, ఆ గొంతుతో పాటు ఓ కాంతిపుంజం కన్పించింది. కాంతిపుంజంతోపాటు దైవ దూతలు ప్రత్యక్షమయ్యారు. వారు తనను ఫ్రాన్స్ నుంచి ఇంగ్లిష్ వారిని తరిమి వేయమని, డాఫిన్‌ని చక్రవర్తిని చేయమని ఆదేశించారు' అని జోన్ చెప్పుకొనేది. ఈ భావన ఆమెలో జీర్ణించుకుపోయి మానవాతీత ధైర్యవంతురాలిగా భావించేది. అదే ఆమె తర్వాత కార్యాచరణలో చూపించింది. డాఫిన్ ప్రభువు సహకారంతో జోన్ ఇంగ్లిష్ సైన్యాన్ని ఓడించింది. ఇది డాఫిన్‌ను 'ఛార్లెస్-6'గా ఫ్రాన్స్ రాజపీఠాన్ని అలంకరించడానికి తోడ్పడింది. దేశభక్తి, ధైర్య సాహసాలకి మరోపేరుగా 'జోన్ ఆఫ్ ఆర్క్' నిల్చింది. తర్వాత బ్రిటిష్ వారు జోన్‌కు తాంత్రిక శక్తులున్నాయని ప్రచారం చేసి ఆమెని సజీవ దహనం చేశారు. డాఫిన్ ప్రభువు కూడా ఆమెను రక్షించలేదు. జోన్ మరణానంతరం జోన్ అమాయకురాలని, గొప్ప దేశభక్తురాలని ఫ్రాన్స్ ప్రకటించి గౌరవించింది. కాకతీయ రాజులని ఎదిరించి వీరమరణం పొందిన సమ్మక్క, సారక్కలని కూడా నేడు దేవతలుగా కొలుస్తున్నారు. బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు వంటి వారు తమకు అతీంద్రియ శక్తులున్నాయని ఎన్నడూ చెప్పలేదు. 'విశ్వమాత'గా పేరుపొందిన మదర్ థెరిస్సా ఎటువంటి మహిమలు లేకుండానే ప్రజానీకానికి విశేషమైన సేవలందించింది. క్యాననైజేషన్ ద్వారా పోప్ ఆమెకు 'సెయింట్‌హుడ్' హోదా ప్రకటించారు. సెయింట్‌హుడ్ హోదా లేకపోయినా ఆమెకున్న గౌరవం ఏమాత్రం తగ్గదు. పూలే, అంబేడ్కర్‌లు దీనజనోద్ధరణ కోసం తమ జీవితాలని త్యాగం చేసి ప్రజలచేత దేవుళ్ళుగా ఆరాధింపబడుతున్నారు.

ప్రజల నమ్మకాలను మూఢనమ్మకాలుగా మార్చడంలో కొందరు బాబాలు సిద్ధహస్తులు. ఫలితంగా ప్రజలు బాబాలు స్వామీజీలపై వ్యక్తిగత ఆరాధన పెంచుకుంటున్నారు. వారు ఏదైనా తప్పు చేశారని తెలిస్తే జీర్ణించుకోలేక పోతున్నారు. మూఢనమ్మకాలని నియంత్రించడానికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు చట్టాలను తీసుకువచ్చాయి. జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం వంటి వాటిని ఈ చట్టపరిధిలోకి తీసుకురాలేదు. ఈ రెండు శాస్త్రాలు కూడా గ్రహాలు, వాటి చలనం, దిక్కులు, మనుషులపై వాటి ప్రభావం, దోషాల నివారణ అనే అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఆఖరికి ఇస్రో శాస్త్రవేత్తలు కూడా శాటిలైట్స్ ప్రయోగానికి ముందో, ఆ తర్వాతో దేవాలయాలు సందర్శించుకొని తమ మొక్కులుని తీర్చుకుంటున్నారు. జీవ రూపంలో ఉన్న ఏ పదార్థానికైనా మరణం తప్పదు. అందుకు బాబాలు, యోగులు, బిషప్‌లు మినహాయింపు



కాదు. దేన్నైనా శోధించి సాధించాలి. మతం, అతీంద్రీయ శక్తులని నమ్మమని చెప్తుంది. సెన్స్ మన పట్ల నమ్మకం ఉంచుకోమని చాటుతుంది. కాబట్టి మనం కనే కలల్ని పట్టుదల, కృషితో సెన్స్ సూత్రాల ద్వారా నిజం చేసుకోవచ్చు.

◆ యం. రాంప్రదీప్,
9492712836

వ్యక్తిత్వ విహంగం

కవిత

ఆశల రెప్పలు తెరుచుకోవడానికి
కాలమనే క్షణం కనుపాప కదలికల కోసం
నేను ఎదురుచూడను / గమ్యం నావ తోవ చూపడానికి,
అదృష్టమనే తెరచాప కోసం నిరీక్షించను/ రిక్త హస్తాలే ,
ధ్యేయ స్థైర్యాలై / నిట్టూర్పుల వూతలే / వెన్నుదన్నులై,
ముడుచుకున్న కోరికలు / నిద్ర కుహరం నుండి
విహ్వాలించుకొని / విహంగాలై ఎగురుతాయి
ఎవరి చేతులు కంటి చెమ్మను తుడవలేవు, అయినా నా చేతలే
నిచ్చెనలై ఎగబ్రాకి అందలాన్నీ అందుకున్నపుడు
రెప రెప లాడుతున్న రెప్పల వీవనల గాలులే తడిని
తుడుస్తాయి / వ్యక్తిత్వపు నెగళ్ల వెలుగులో
నా పయనం / దారి మార్చుకొమ్మని ఎన్ని అడ్డదారులు
పిలుస్తున్నా హెచ్చరికల ముళ్ల చూపుడు వేళ్లను
తొలగించుకుంటూ మౌనిలా సాగుతుంటాను
తెరుచుకున్న నోళ్ళ తలుపులు
మూయడానికి నేను చేసే ప్రయత్నాలు సహనం చురకత్తుల
తాళాన్ని / సిద్ధం చేసుకొని
ద్వార పాలికలా కాపలా కాస్తాయి
నా వైపు వచ్చే ఓటమి భయం నీలినీడలు
నా గుండె కంచె గోడల్ని తాకవు / చుట్టూ వున్న చీకటి
ముసుగు / నిజం కాదని / వెలుతురు మిణుగురుల చిన్న
దివిటితోనైనా చూపించడానికి
ఈ ప్రస్థానం మొదలుపెడతాను.

- సముద్రాల శ్రీదేవి,
తెలుగు ఉపాధ్యాయిని
9949837743

10 నెలల కనిష్టానికి వాణిజ్య లోటు.. రూపీ అప్

- అమెరికా డాలర్‌తో పోలిస్తే స్వల్ప లాభంతో ట్రేడింగ్
- 70.95 వద్ద కదలాడుతున్న రూపాయి
- నష్టాల్లో ఆసియా మార్కెట్ల కరెన్సీలు



న్యూఢిల్లీ: ఇండియన్ రూపాయి బుధవారం లాభాల్లో ట్రేడవుతోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. భారత్ వాణిజ్య లోటు డిసెంబర్‌లో 10 నెలల కనిష్టానికి తగ్గడం సానుకూల ప్రభావం చూపింది. భారత్‌లో పదేళ్ల బాండ్ ఈల్డ్స్ 7.25 శాతం వద్ద ట్రేడవుతున్నాయి. బాండ్ ఈల్డ్స్ మునపటి ముగింపు (మంగళవారం) స్థాయి 7.252 శాతంగా ఉంది. బాండ్ ఈల్డ్స్, ధరలు పరస్పరం వ్యతిరేక దిశల్లో ఉంటాయి.

దేశీ వాణిజ్య లోటు డిసెంబర్ నెలలో 13.08 బిలియన్ డాలర్లకు తగ్గింది. ఇది పది నెలల కనిష్ట స్థాయి. బంగారం దిగుమతులు తగ్గడం వల్ల వాణిజ్య లోటు దిగివచ్చిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. నవంబర్‌లో వాణిజ్య లోటు 16.67 బిలియన్ డాలర్లుగా నమోదైన విషయం తెలిసిందే.

వరుసగా ఆరో రోజు పెరిగిన పెట్రోల్ ధర



న్యూఢిల్లీ: మకర సంక్రాంతి పండుగ రోజు కూడా చమురు ధరలు కనికరించలేదు. వరుసగా ఆరో రోజు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు పెరుగుతుండటంతో దేశంలో ఇంధన ధరలు పరుగులు పెడుతున్నాయి. దీంతో దేశ రాధానిలో లీటర్ పెట్రోల్ రూ.70.41కి చేరింది. కొత్త ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం ఏడు సార్లు ఇంధన ధరలు పెరిగాయి. మంగళవారం ఇంధన కంపెనీలు పెట్రోల్‌పై రూ.0.26పైసలు పెంచగా, డీజిల్‌పై రూ.0.29 పైసలు పెంచాయి.

ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో రూ.0.28 పైసలు పెరిగి లీటర్ పెట్రోల్ ధర రూ.76.05గా ఉంది. డీజిల్ ధర రూ.67.49కి చేరింది. పెట్రోల్ ధరలు కోల్‌కతాలో రూ.72.52, చెన్నైలో రూ.73.08గా నమోదయ్యాయి. జనవరి 7న ఒకసారి, ఆ తర్వాత జనవరి 10 నుంచి వరుసగా ఇంధన ధరలు రోజూ పెరుగుతూనే ఉన్నాయి.

ఇంటికి, ఇంట్లోని వస్తువులకు బీమా

విస్తారమైన వాన, వరదలు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు, దొంగతనాలు, అగ్ని ప్రమాదాల కారణంగా ఎంతో విలువైన ఇంటికే కాదు... అందులోని ఖరీదైన వస్తువులకూ వాటిల్లే ఆర్థిక నష్టం నుంచి తేరుకోవాలంటే అందుకు ఏకైక సాధనం హౌస్‌హోల్డర్స్ పాలసీ. న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్ ఇండియా, నేషనల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, బజాజ్ అలియాంజ్, రాయల్ సుందరం, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో తదితర బీమా సంస్థలన్నీ ఈ పాలసీని ఇస్తున్నాయి. ఇంటితో బాటు అందులో నివసించే వ్యక్తులు, ఉండే వస్తువులకూ బీమా రక్షణ కల్పించటం ఈ పాలసీ ప్రత్యేకత. వారు వీరు అన్న తేడా లేకుండా సొంతిల్లు ఉన్న వారంతా హౌస్‌హోల్డర్స్ పాలసీ తీసుకోవచ్చు. గ్రామాలు, పట్టణాలన్న తేడా ఏమీ ఉండదు.

పాలసీ నిబంధనలు

సాధారణంగా హౌస్‌హోల్డర్స్ పాలసీలో పది సెక్షన్లు ఉంటాయి. ఒకో సెక్షన్ ఒకో రకం నష్టానికి పరిహారం ఇస్తుంది. మీ అవసరాలను బట్టి కావాల్సిన సెక్షన్లను ఎంచుకోవచ్చు. ఉదాహరణకు, సెక్షన్ 1ఎ ఇంటికి వర్తిస్తుంది. సెక్షన్ 1బి ఇంట్లోని వస్తువులకు వర్తిస్తుంది. ఇందులో సెక్షన్ 1బి తప్పనిసరి. మిగిలిన సెక్షన్లలో మీకు కావాల్సిన వాటినే ఎంచుకోవచ్చు.ఇంటికి, ఇంట్లోని వస్తువులకు, దొంగలు పడి ఇల్లంతా దోచుకున్నా, అగ్నిప్రమాదం సంభవించి గెపకరణాలు ధ్వంసమైనా, షార్ట్ సర్క్యూట్ వల్ల టీవీ, వీసీడీ, కంప్యూటర్ వంటి వస్తువులు పాడైతే, సైకిల్ అపహరణకు గురైనా, ప్రయాణ సమయాల్లో లగేజీని అ పహ రించినా పరిహారం లభిస్తుంది. ప్రకతి ప్రకోపాల నుంచి ఉగ్ర వాదుల దాడుల వరకూ కారణం ఏదైనప్పటికీ బీమా అండగా నిలుస్తుంది.



ఎక్కువ బీమా తక్కువ ప్రీమియం

గృహ బీమా పాలసీకి ప్రీమియం నామమాత్రంగానే ఉంటుంది. ప్రీమియాన్ని లెక్కించేటప్పుడు కొన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకుంటారు. ఇంటి వైశాల్యం, భౌగోళిక పరిస్థితులు, నిర్మాణం తీరు తదితర వాటి ఆధారంగా ప్రీమియం ఉంటుంది. ఇంటికీ, ఇంట్లోని వస్తువులకూ కలిపి రూ.లక్ష బీమా పాలసీ తీసుకుంటే.. ఏడాదికి ప్రీమియం రూ.50–100కు మించదు. టీవీ, ఫ్రిజ్, ఎల్ఈడీ టీవీ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు కలిపి రూ.లక్ష వరకూ పాలసీ తీసుకుంటే.. రూ.1100 వరకూ ఉంటుంది. అన్ని సెక్షన్లనూ కలిపి తీసుకున్నా.. రూ.లక్షకు ప్రీమియం ఖర్చు రూ.2,000 దాటదు. కంపెనీలను బట్టి ప్రీమియం రేట్లు మారవచ్చు.



ఎక్కడి నుంచి పెరిగిందో మళ్లీ అక్కడికే

- ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు
- 3 పాయింట్ల లాభంతో 36,321కు సెన్సెక్స్
- 10,900 దిగువకు నిఫ్టీ
- 3 పాయింట్ల లాభంతో 10,890 వద్ద ముగింపు


న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్ బుధవారం ఫ్లాట్‌గా ముగిసింది. లాభాల్లో ప్రారంభమైన బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు చివరకు అదే జోరును కొనసాగించలేకపోయాయి. సెన్సెక్స్ 3 పాయింట్ల లాభంతో 36,321 వద్ద, నిఫ్టీ 3 పాయింట్ల లాభంతో 10,890 వద్ద క్లోజయ్యాయి. నిఫ్టీ ఆరంభంలోనే 10,900 స్థాయిని దాటేసింది. అయితే ఆ స్థాయిని రక్షించుకోలేకపోయింది.

ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ఉండటం, యూరప్‌లోని అస్థిర పరిస్థితులు, బలహీన అంతర్జాతీయ సంకేతాలు మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి.

నిఫ్టీ 50లో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, యస్ బ్యాంక్, విప్రో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బీపీసీఎల్, గ్రాసిమ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, ఐటీసీ షేర్లు లాభపడ్డాయి. ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, యస్ బ్యాంక్, విప్రో షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి.

ఇక జేఎస్‌డబ్ల్యూ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, యూపీఎల్, ఏసియన్ పెయింట్స్, వేదాంత, హీరో మోటొకార్ప్, హెచ్‌సీఎల్ టెక్, జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు నష్టపోయాయి. ఇవ్వన్నీ 1–2 శాతం శ్రేణిలో పడిపోయాయి.

ఇంట్రాడేలో నిఫ్టీ 10,876 పాయింట్ల కనిష్ట స్థాయిని, 10,928 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఇక సెన్సెక్స్ 36,278– 36,462 పాయింట్ల శ్రేణిలో కదలాడింది.



బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా ఇండెక్స్‌లు లాభాలతో ముగిశాయి. ఎఫ్ఎంజీసీ, మెటల్, ఆటో, ఫైనాన్స్ సర్వీసెస్, రియల్టీ రంగ ఇండెక్స్‌లు నష్టాలతో క్లోజయ్యాయి.

బంగారం లాంటి.. లాభం

బంగారు నగలు కేవలం అలంకరణ, హోదాకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, అవసరానికీ ఆదుకునే 'బంగారం'లాంటి మార్గం కూడా. బంగారు నగ ధరించడం ఇష్టంలేనివాళ్ళు ఈ మధ్య కాలంలో తమ భవిష్యత్ అవసరాల కోసం గోల్డ్ కొనడంలో మొగ్గు చూపుతున్నారు.

ప్రయోజనాలు

ఒక్కసారిగా పెద్ద మొత్తంలో బంగారం కొనగలిగే శక్తి లేకపోయినా.. ఒకటి, రెండు గ్రాముల చొప్పున చేతిలో డబ్బులు ఉన్నప్పుడు బంగారం కొనడం అలవాటు చేసుకుంటే, అది భవిష్యత్తులో అనేక అవసరాలు తీరుస్తుంది. ఒక క్రమపద్ధతిలో నెలకు గ్రాము చొప్పున గోల్డ్ కొనాలని నియమం పెట్టుకోండి. అలా.. క్రమం తప్పకుండా బంగారంపై కాస్తంత పెట్టుబడి



పెట్టగలిగితే, ఏడాదిలో పది, పన్నెండు గ్రాముల బంగారం మనదగ్గర ఉన్నట్టే. ఇలా పోగు చేసుకున్న బంగారాన్ని రకరకాల రూపాల్లో ఉపయోగించుకోవచ్చు. భద్రతపరంగా మన దగ్గరున్న బంగారాన్ని బ్యాంకుల్లో జమ చేస్తే స్వల్పవడ్డీ కూడా బ్యాంకులు అందజేస్తున్నాయి.

మార్కెట్లో బంగారం రేటు లాభసాటిగా ఉంటే, కొన్నప్పటి రేటు కంటే అధిక మొత్తం వస్తుందనుకున్నప్పుడు, తక్షణ అవసరాల కోసం బంగారాన్ని లాభానికి అమ్ముకోవచ్చు. దాదాపు అన్ని బ్యాంకులూ బంగారంపై తక్కువ వడ్డీపై రుణాలు అందజేస్తున్నాయి. బంగారం విలువలో దాదాపు 90 శాతం వరకూ లోన్ తీసుకొని, వాయిదా పద్ధతుల్లో తీసుకున్న రుణం చెల్లించవచ్చు. బంగారం మదుపు చేయడం ద్వారా ఇలాంటి ప్రయోజనాలన్నీ పొందే అవకాశం ఉంది. కొద్దిపాటి మొత్తంలోనైనా బంగారం కొనే అలవాటు అన్నివర్గాల వారికీ మంచిదే అంటున్నారు నిపుణులు.

రానున్న బడ్జెట్‌లో ఉద్యోగులకు భారీ ఊరట?

- ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేయవచ్చనే అంచనాలు
- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే అవకాశం
- ఇదే జరిగితే రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయంపై పన్ను ఉండదు
- ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేందుకు తాయిలాలు సిద్ధం చేస్తోంది. తద్వారా మరోమారు అధికారంలోకి రావాలని భావిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీనికి మూడు వారాల కన్నా తక్కువ గడువే ఉంది. సామాన్య ప్రజల నుంచి పరిశ్రమ వర్గాల వరకు అందరి చూపు ఆదాయపు పన్ను శ్లాబ్‌ల పైనే ఉంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఆదాయపు పన్ను విషయంలో వేతన జీవులకు ఊరట కల్పించవచ్చనే అంచనాలున్నాయి.

రానున్న బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేయవచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచొచ్చని అంచనాలున్నాయి. అంటే రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. కాగా ప్రస్తుతం వార్షికాదాయం రూ.2.5 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం వైద్య ఖర్చులను, రవాణా అలవెన్స్‌లను మళ్లీ పన్ను మినహాయింపు కిందకు తీసుకురావొచ్చని తెలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా ఆదాయ వ్యయాలకు వీలు కల్పించే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఈ బడ్జెట్‌లో ఎక్కువ ప్రయోజనాలను ఆశించడం తగదు.

2018లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అరుణ్ జైట్లీ ఆదాయపు పన్ను రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. గత మూడేళ్లుగా వేతనజీవులకు ప్రభుత్వం తగినంత ఊరట కలిగించిందని, అందువల్ల ఈ సారి ఆదాయపు పన్నులో ఎలాంటి మార్పులు ప్రతిపాదించలేదని బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ పేర్కొన్నారు. అయితే రవాణా, వైద్యం కోసం చేసే ఖర్చుల్లో రూ.40 వేల వరకు పన్ను మినహాయింపు ఇచ్చారు.

ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచితే అది వేతన జీవులకు భారీ ఊరట కిందే లెక్క. ఆదాయపు పన్ను పరిమితి పెంచాలని ఎప్పటినుంచో ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోలేదు. ప్రతి బడ్జెట్‌కు ముందు దీనిపై ఆసక్తిగా ఎదురుచూడటం, తర్వాత నిరాశ చెందడం సర్వసాధారణం అయిపోయింది. ఎన్నికల పుణ్యమా అని తమ కోరిక నెరవేరాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. 60 ఏళ్లు నుంచి 80 లోపు వారికి రూ.3 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదు. అదే 80 ఏళ్లు పైన ఉన్నవారు రూ.5 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఉండదు. అదేసమయంలో 50 లక్షలు పైన ఆదాయం ఉన్న వారు పన్ను రేటుపై 10 శాతం సర్‌చార్జ్ చెల్లించాలి. అదే ఆదాయం రూ.కోటి దాటితే 15 శాతం సర్‌చార్జ్ కట్టాలి.

రుణమైనా.. పొదుపైనా అకౌంట్ ఉండాలి!

ఈ రోజుల్లో 'బ్యాంకు అకౌంట్ లేనివాళ్ళు ఉండరు. నూటికి తొంభై తొమ్మిది శాతం మంది ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతుంటాయి. రానున్న రోజుల్లో ఇది మరింత విస్త ృతమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగస్థుల జీతాలు పంపిణీ విషయంలో దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థలు ఇప్పటికే బ్యాంకు అకౌంట్స్ ద్వారానే నగదును బదిలీ చేస్తున్నాయి. దీనివల్ల డబ్బుకు భద్రతతో పాటు కొన్ని సందర్భాల్లో ఆర్థిక ప్రయోజనాలూ చేకూరే అవకాశం ఉంది.

సేవింగ్స్ అకౌంట్

వ్యక్తిగత బ్యాంకు అకౌంట్ ద్వారా ఆర్థిక లావాదేవీలు, డబ్బు నిల్వలు, నగదు– బదిలీ, పంపిణీ, చెక్ ట్రాన్స్‌ఫర్ వంటి వసతుల్ని రెగ్యులర్‌గా వినియోగించుకోవడం వల్ల బ్యాంకింగ్ రంగం పట్ల ఓ అవగాహన ఏర్పడుతుంది. బ్యాంకు ఖాతావల్ల ఎలాంటి సౌకర్యాలున్నాయనే విషయాల్ని సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. డబ్బులు పొదుపు చేయడం, వేరొకరికి ట్రాన్స్‌ఫర్ చేయడం, సేవింగ్ అకౌంట్ ద్వారా వస్తువులు కొనుగోలు చేయడం వంటివి బ్యాంకు అకౌంట్ ద్వారా చేస్తూ ఉండటం మంచిది. దీనివల్ల సదరు అకౌంట్ దారుడి ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక శక్తిసామర్థ్యాల్ని బ్యాంకులు అంచనా వేయడానికి వీలుకలుగుతుంది. బ్యాంకులతో సత్సంబంధాలు కలిగిన ఖాతాదారులకు కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు వాటికవే ముందుకొస్తుంటాయి.

రుణం తీసుకోవాలంటే?

ప్రతి ఒక్కరి జీవితంలోనూ అప్పు చేయడం అనేది సర్వసాధారణం. ఇల్లు, వివాహం, గ హం, చదువు, వ్యాపారం ఇలా అనేక అవసరాల కోసం అనివార్యంగా డబ్బులు అవసరం అవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులకు సైతం బ్యాంకులు అండగా నిలుస్తుంటాయి. తిరిగి చెల్లించే సామర్థ్యాన్నిబట్టి ఆర్థిక సంస్థలు రుణాలు మంజూరు చేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకు అకౌంట్ తప్పనిసరి. రుణం తీసుకునే సమయానికి, అంటే అప్పటికే కొంతకాలంగా బ్యాంకు అకౌంట్ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిపే అలవాటు ఉంటే మంచిది. కేవలం రుణం తీసుకోవడం కోసం మాత్రమే బ్యాంకు అకౌంట్ తెరవడం అంత సమర్థనీయం కాదు. వ్యక్తిగత ఖాతాలోని తీరుతెన్నులను బట్టీ బ్యాంకులు స్పందిస్తాయి.



అకౌంట్ ట్రాన్స్‌ఫర్ బెటర్

అలాగే నెలవారీ చెల్లించాల్సిన సొమ్ములు, రుణాలకు చెందిన కంతులు, గ పెకరణాల కొనుగోళ్ళు, వ్యక్తిగత బాకీలు, ఫీజులు, బిల్లులు ఇలాంటివన్నీ బ్యాంకు ఖాతా నుంచి బదిలీ (ట్రాన్స్‌ఫర్) చేయడం మంచిది. ఇలా చేయడం వల్ల ఇతరుల దగ్గర మోసపోవడానికి అవకాశం ఉండదు. దీంతోపాటు వ్యక్తిగత ఫైనాన్సియల్ క్రెడిట్ స్కోర్ కూడా మెరుగుపడుతుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అయితే బ్యాంకు పాస్ పుస్తకం పై వున్న చిరునామానే 'అడ్రస్ ప్రూఫ్'గా గుర్తించడం జరుగుతుంది. అందుకే కేవలం ఉద్యోగస్థులు, వ త్తి వ్యాపారాల్లో ఉన్న వారు మాత్రమే కాకుండా తోపుడుబండి, సైకిల్‌పై వ్యాపారం సాగించే చిరు వ్యాపారస్థులు, గృహిణులు, విద్యార్థులు, రోజువారీ సంపాదనగల కూలీలు ఇలా ప్రతి ఒక్కరికీ బ్యాంకు అకౌంట్ ఉండటం మంచిది.

మనం మూవీ
manammovie



సేనాపతిగా కమల్ ఇండియన్ 2 లుక్

వయసు మళ్లిన స్వాతంత్ర్య పోరాట యోధుడు.. ఎంతో కష్టపడి సాధించిన స్వాతంత్ర్యం లంచగొండుల చేతిలో పడి నాశనం అవుతుంటే చూడలేక.. అవినీతి నిర్మూలనకు నడుం కడతాడు. వయసు అయిపోయిన వాడు కదా.. ఏం చేస్తాడనుకుంటే పొరపాటే!. సేనాపతిగా పిలవబడ్డ ఆయన మర్మకళలో సిద్ధహస్తుడు. లంచగొండి అధికారులను చంపే క్రమంలో తన కడుపులో పుట్టిన కన్న కొడుకు కూడా లంచగొండి అని.. అతని కారణంగా నలబై మంది పిల్లలు చనిపోయారని తెలుసుకుని కన్నకొడుకుని కూడా చంపేస్తాడు. అదే ఆయన నిజాయతీ. ఆయనే 'ఇండియన్' సినిమా. 1996లో కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లో విడుదల అయిన ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు మళ్లీ ఈ జోడి తెరపై సందడి చేయనుంది. ఇండియన్ సీక్వెల్‌గా 'ఇండియన్ 2' ఈ నెల 18 నుండి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఈ సినిమాకు సంబంధించిన సేనాపతి మర్మకళ స్టైల్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.



ఏప్రిల్ 5న నాగచైతన్య, సమంత మజిలి

పెళ్ళి తర్వాత అక్కినేని నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న తొలి చిత్రం 'మజిలి'. న్యూ ఇయర్ సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు రెండో లుక్ సంక్రాంతి సందర్భంగా విడుదల చేసింది చిత్రయూనిట్. నాగచైతన్యతోపాటు ఈ చిత్రంలో రెండో హీరోయిన్‌గా నటిస్తున్న దివ్యాంశ కౌశిక్ ఈ లుక్‌లో ఉన్నారు. ఫస్ట్ లుక్‌లో గడ్డంతో కనిపించిన నాగచైతన్య ఈసారి మాత్రం క్లీన్ షేవ్‌తో ఉన్నారు. పైగా చేతిలో క్రికెట్ బ్యాట్ పట్టుకుని చాలా స్టైలిష్‌గా ఉన్నారు నాగచైతన్య. దేర్ ఈజ్ లవ్.. దేర్ ఈజ్ పెయిన్ అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ చిత్రం వైజాగ్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివనిర్వాణ. నిన్నుకోరి తర్వాత శివనిర్వాణ తెరకెక్కిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. 80 శాతం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. రావు రమేష్, పోసాని క ష్ణమురళి, సుబ్బరాజ్ ఈ చిత్రంలో కీలకపాత్రల్లో నటిస్తున్నారు. గోపీసుందర్ సంగీతం అందిస్తుండగా.. విష్ణుశర్మ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గరపాటి, హరీష్ పెద్ది ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



'ఊరంతా అనుకుంటున్నారు'

నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల హీరోలు. మేఘా చౌదరి, సోఫియా సింగ్ నాయికలు. బాలాజి సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ లోగోను సూపర్ స్టార్ కృష్ణ, ఫస్ట్ లుక్‌ను విజయనిర్మల, హీరో ఫస్ట్ లుక్‌ను నరేష్, నవీన్ లుక్ టీజర్‌ను కృష్ణ, విజయ నిర్మల విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ''టైటిల్ బావుంటే సగం సినిమా సక్సెస్ అయినట్టే. అందులోనూ ఈ సినిమాకు 'ఊరంతా అనుకుంటున్నారు' అనే నేటివ్ టైటిల్ దొరికింది. ఇంగ్లిష్ పదాలతో ఎక్కువ టైటిల్స్ వస్తున్న ఈ సమయంలో ఇలాంటి టైటిల్ రావడం బావుంది. చిన్నప్పటి నుంచి సినిమా అట్మాస్ఫియర్‌లో పెరిగాడు మా నవీన్. తనలో ఈజ్ ఉంది. పాటలు, ఫైట్లు అన్నీ బాగా చేయగలుగుతున్నాడు. ఆర్టిస్ట్ గా మంచి ఫ్యూచర్ ఉంటుంది. మా నరేష్ జడ్జిమెంట్ బావుంటుంది. నరేష్ కథ విన్నానని.. బావుందని చెబుతున్నాడంటే సినిమాలో విషయం ఉన్నట్టే. నవీన్‌కి ఈ సినిమాతో ఫ్యాన్ ఫాలోయింగ్ రావాలి' అని అన్నారు. విజయనిర్మల మాట్లాడుతూ ''నిర్మాతను , ఈ సినిమాను అందరూ దీవించాలి'' అన్నారు. కె.ఎం.రాధాకృష్ణన్ మాట్లాడుతూ ''నవీన్ పాత్ర చాలా బావుంటుంది. కథాబలం ఉన్న సినిమా. గ్రామీణ నేపథ్యంతో సాగుతుంది'' అన్నారు. నవీన్ మాట్లాడుతూ ''పాలకొల్లులో ఈ సినిమా కోసం షూటింగ్ చేశాం. నేను ఇంతకు ముందు ఎప్పుడూ పాలకొల్లుకు వెళ్లలేదు. ఈ సినిమాతో అక్కడే సెటిల్ కావాలనిపించింది. చాలా మంచి సినిమా అవుతుంది'' అని అన్నారు. నరేష్ మాట్లాడుతూ ''నందిని నర్సింగ్ హోమ్'తో నవీన్ మంచి హీరోగా పేరు తెచ్చుకున్నాడు. హీరోగా, ఆర్టిస్ట్ గా నిలదొక్కుకోవాలనేది అతని తాపత్రయం. ఆ సినిమా తర్వాత 5,6 స్క్రిప్ట్ లు విన్నాడు. వాటిలో ఈ కథ మాకు బాగా నచ్చింది. డబ్బింగ్ జరుగుతోంది'' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ ''గ్రామీణనేపథ్యంలో అందంగా సాగే సినిమా ఇది. క్యూట్ విలేజ్ బోయ్‌గా నవీన్ మెప్పిస్తాడు. కొత్త జోనర్ సినిమా అవుతుంది. నవీన్‌లోని పలు షేడ్స్ ఈ సినిమాలో ఆవిష్క తమవుతాయి'' అని అన్నారు.



మాధవన్, అనుష్క ప్రధాన పాత్రల్లో...

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంయుక్తంగా ఓ చిత్రాన్ని పలుభాషలలో నిర్మించటానికి సన్నాహాలు చేస్తున్నాయి. తెలుగు, తమిళం, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మితమవుతున్న తొలి క్రాస్ ఓవర్ చిత్రమిది. హార్రర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో బహుభాషా నటుడు మాధవన్, అనుష్క శెట్టి అంజలి, షాలిని పాండే, అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజు ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్, గోపీసుందర్, షనీల్ డియో, గోపి మోహన్, నీరజ కోన ఈ చిత్రానికి సాంకేతిక నిపుణులు. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియ పరుస్తాం. మార్చిలో ఈ చిత్రం షూటింగ్ అమెరికాలో ప్రారంభమవుతుందని, 2019 ద్వితీయార్ధంలో చిత్రం విడుదల అవుతుందని చిత్ర నిర్మాణ సంస్థల అధినేతలు టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్ తెలిపారు.

'సుబ్రహ్మణ్యపురం' దర్శకునితో సందీప్ కిషన్ చిత్రం



సందీప్ కిషన్, 'సుబ్రహ్మణ్యపురం' దర్శకుడు సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో క్రీడా క్రీడా నేపథ్యంలో ఒక సినిమా చేయబోతున్నారు. భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలు గురుదక్షిణగా తీసుకున్నాడు ద్రోణాచార్యులు. ఈ ఆధునికకాలంలో అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడు అనే ఉత్సుకత రేకెత్తించే కథాంశంతో రూపొందించే ఈ చిత్రానికి ''కార్తికేయ' లాంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్ నిర్మాత. మిగిలిన నటీనటుల మరియు సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియచేస్తారు.



తలైవాతో కీర్తి

సంక్రాంతి విడుదలైన 'పేట' తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న రజనీకాంత్ త్వరలోనే మరో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారు. ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో రజనీకాంత్ సినిమా చేయబోతున్నాడని కోలీవుడ్ వర్గాల్లో వార్తలు వినపడుతున్నాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈ సినిమాలో రజనీకాంత్ సరసన కీర్తిసురేష్‌ను హీరోయిన్‌గా నటింప చేస్తున్నారట. ఎ.ఆర్.మురుగదాస్ గత చిత్రం 'సర్కార్'లో కూడా కీర్తిసురేష్ హీరోయిన్‌గా నటించింది. ఆమెనే తలైవా సరసన నటింప చేయడానికి మురుగదాస్ ఆసక్తి చూపుతున్నాడని టాక్. ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో ఓ సినిమా చేస్తుంది.



ఏప్రిల్ 12న 'చిత్రలహరి'

సాయిధరమ్‌తేజ్ హీరోగా మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై కిశోర్ తిరుమల దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సి.వి.మోహన్ నిర్మిస్తున్న చిత్రం 'చిత్రలహరి'. సాయిధరమ్ తేజ్ సరసన కల్యాణి ప్రియదర్శన్, నివేదా పేతురాజ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాను ఏప్రిల్ 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''షూటింగ్ అనుకున్న ప్లానింగ్ ప్రకారం జరుగుతోంది. దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. సాయిధరమ్ తేజ్‌ను సరికొత్త యాంగిల్‌లో కిషోర్ తిరుమలగారు ప్రెజంట్ చేస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తాం'' అన్నారు. కిషోర్ తిరుమల మాట్లాడుతూ ''మంచి ఎమోషనల్ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా చిత్రలహరి తెరకెక్కుతోంది. టైటిల్‌లో ఐదు అక్షరాలు ఉన్నట్లు సినిమాలో ఐదు క్యారెక్టర్స్‌కు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటాయి. సినిమా ఈ పాత్రల చుట్టూ ఎక్కువగా తిరుగుతుంది. సాయిధరమ్ తేజ్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీ అవుతుంది'' అన్నారు.

బ్రహ్మానందం గుండెకు శస్త్రచికిత్స



టాలీవుడ్ ప్రముఖ సీనియర్ కమెడియన్ బ్రహ్మానందం ఆదివారం ముంబైలో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ను దగ్గరలోని ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. ఆయన్ని పరిశీలించిన డాక్టర్స్ శస్త్రచికిత్స చేయించాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రమాకాంత్, సోమవారం శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆయన కోలుకోవాలని అభిమానులు సహా అందరూ సోషల్ మీడియాలో మెసేజ్‌లు పోస్ట్ చేస్తున్నారు.

రిచాకు పెళ్లి కళ వచ్చేసింది



గ్లామర్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్న రిచా గంగోపాధ్యాయ త్వరలోనే పెళ్ళి చేసుకోబోతోంది. తన ప్రియుడు జోనుతో ఆమెకు నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో రిచా ప్రకటించింది. తనకు కాబోయే భర్తతో కలిసి దిగిన ఫోటోను పోస్ట్ చేసింది. 'జోను నాకు బిజినెస్ స్కూల్ పరిచయం. రెండు సంవత్సరాలు అద్భుతంగా గడిచింది. ఇప్పుడు నిశ్చితార్థం జరిగింది. నా జీవితంలోని అందమైన ఘట్టం కోసం ఎదురుచూస్తున్నాను' అని పోస్ట్ చేసింది. 'లీడర్' చిత్రంతో హీరోయిన్‌గా పరియమైన రిచా ఆ తర్వాత 'నాగవల్లి', 'నాగవల్లి', 'మిరపకాయ్', 'సారొచ్చారు', 'మిర్చి', 'భాయ్' సినిమాల్లో తన అందచందాలతో, అభినయంతో ఆకట్టుకుంది. వీటితోపాటు తమిళ్, బెంగాలీ సినిమాల్లో కూడా నటించింది. వివాహం తర్వాత సినిమాల్లో నటించే ఉద్దేశం రిచాకు లేదట.



ప్రియా ప్రకాశ్‌కు బోనీ కపూర్ నోటీసులు



ఒక చిన్న పిల్ల .. ఓ అమ్మాయిని మీకు నచ్చిన హీరోయిన్ ఎవరు? అని అడిగితే నాకు నచ్చిన హీరోయిన్ నేనే! నా పేరు శ్రీదేవి అని చెబుతుంది. ఇది 'శ్రీదేవి బంగ్లా' సినిమాలోని డైలాగ్. చిన్నగా కన్నుగీటి నేషనల్ వైడ్ ఫేమస్ అయిన ప్రియా ప్రకాశ్ వారియర్ ఇప్పుడు 'శ్రీదేవి బంగ్లా' చిత్రంలో నటిస్తుంది. ప్రశాంత్ మాంబుల్లి దర్శకత్వంలో సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా టీజర్ రీసెంట్‌గా విడుదలైంది. ఇందులో హీరోయిన్ పేరు శ్రీదేవి ..శ్రీదేవి జీవిత చరిత్రను పోలినట్టు సినిమా.. చివరగా బాత్ టబ్‌లో ఓ అమ్మాయి పాదాలు పైకి కనపడేలా ఉండటంతో ఇది శ్రీదేవి జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని తెరకెక్కిన సినిమాగా భావిస్తున్నారందరూ. శ్రీదేవి భర్త, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ కూడా అలాగే భావించి చిత్ర యూనిట్‌కు లీగల్ నోటీసులను పంపాడు. అయితే సినిమా చూస్తేనే కదా! ఇది ఏ సినిమానో తెలుస్తుంది. మేం కేసును ధైర్యంగా ఎదుర్కొంటాం అంటూ దర్శకుడు ప్రశాంత్ మాంబుల్లి చెబుతున్నారు.

అరుణ్‌జైట్లీకి కేన్సర్

- అమెరికాకు పయణం.. చికిత్స
- బడ్జెట్‌కు అందుబాటులో అనుమానమే



న్యూఢిల్లీ, జనవరి 16: ఎన్నికలకు ముందు కీలకమైన ఆర్థిక బడ్జెట్ 2019 (తాత్కాలిక బడ్జెట్‌ను) కేంద్ర ఆర్థికమంత్రిశాఖ అరుణ్ జైట్లీ (66)చేతుల మీదుగా లోక్‌సభలో ప్రవేశపెడతారా లేదా అనేది ఇపుడు సందేహా స్పదంగా మారింది. ఆయన మరోసారి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్న వార్త ఈ ప్రశ్నలి లేవనెత్తుతోంది. మూ త్రపిండ మార్పిడి ఆపరేషన్ చేయించుకుని ఇపుడిపుడే కోలుకుంటు న్న ఆయన మళ్లీ అనారోగ్యం పాలయ్యారు. తొడలో సాఫ్ట్ టిష్యూ కాన్సర్ (శరీరంలోని ఇతర భాగాలకు చాలా వేగంగా విస్తరించే)తో బాధపడుతున్నారని 'ది వైర్' వెబ్‌సైట్ వెల్లడించింది. చికిత్స కోసం ఆయన అమెరికాకు వెళ్లారని కూడా తెలిపింది. తాజా నివేదికల ప్రకారం రెండు వారాల వ్యక్తిగత సెలవుపై ఆయన చికిత్సకోసం న్యూయార్క్‌కు బయలుదేరి వెళ్లారు. అమెరికాలో జైట్లీకి శస్త్రచికిత్స నిర్వహించన్నారు. ఆపరేషన్‌తోపాటు కీమోథెరపీ చికిత్సల అనంతరం ఇంత స్వల్పకాలంలో రాజధానికి తిరిగి వచ్చే అవకాశం లేదని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేవలం పరీక్షల నిమిత్తమే న్యూయార్క్‌కు వెళ్లారా, అసలు కేంద్ర విత్తమంత్రి ఆరోగ్య పరిస్థితి ఏంటి? బడ్జెట్‌ను ఎవరు ప్రవేశపె డతారు అనేదానిపై స్పష్టత లేదు. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గత ఏడాది అరుణ్ జైట్లీ కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించు కున్నారు. ఈ సందర్భంగా రైల్వేమంత్రి పియూష్ గోయల్ ఆర్థిక మంత్రిత్వశాఖ తాత్కాలిక బాధ్యతలను స్వీకరించిన సంగతి తెలిసి ందే. అయితే ఈ వార్తలపై స్పందించేందుకు ఆర్థికమంత్రిత్వ శాఖ ప్రతినిధి నిరాకరించారు. మరోవైపు ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశ పెట్టను?న్న తాత్కాలిక బడ్జెట్‌పై అవగాహన కల్పించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ సిద్ధమైంది. ట్విటర్ ద్వారా 'నో యువర్ బడ్జెట్ 2019' పేరుతో వివిధ అంశాలపై పోస్ట్‌లను ట్వీట్ చేస్తోంది. రెవెన్యూ, క్యాపిటల్ బడ్జెట్, ఔట్ కంబడ్జెట్ తదితర అంశాలను సంక్షిప్తంగా వివరిస్తోంది.

మరో ఆప్ ఎమ్మెల్యే గుడ్‌బై

- కేజ్రీవాల్ నియంత పోకడలు.. పంజాబ్‌లో ఎదురుదెబ్బలు

న్యూఢిల్లీ, జనవరి 16: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే బల్‌దేవ్ సింగ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ నియంతలా వ్యవహరిస్తున్నారని, ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని ఆయన ఆరోపించారు. తన రాజీనామాను నేరుగా కేజ్రీవాల్‌కే బుధవారం పంపారు. పార్టీ తన ప్రాథమిక సిద్ధాంతాలకు పూరతిగా తిలోదకా లిచ్చినందున బాధతో తాను రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇంతకుముందు హెచ్ఎస్ ఫూల్కా, సుఖ్‌పాల్ సింగ్ ఖైరా కూడా ఇవే కారణాలతో రాజీనామా చేశారు.


థెరిస్సాకు పదవీ గండం

- బ్రెగ్జిట్‌ను తిరస్కరించిన బ్రిటన్ పార్లమెంట్
- విశ్వాస తీర్మానాన్నిపెట్టిన విపక్ష లేబర్ పార్టీ

లండన్, జనవరి 16: బ్రిటన్ ప్రధాని థెరిసా మేకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈయూ సమాఖ్యతో బ్రెగ్జిట్‌పై చేసుకున్న ఒప్పందంపై బ్రిటన్ పార్లమెంట్‌లో నిర్వహించిన చారిత్రక ఓటింగ్‌లో ఆమె ఓటమి పాలయ్యారు. దీంతో ఆమె విశ్వాస పరీక్ష ఎదుర్కోవాల్సి వచ్చింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలగాలని బ్రిటన్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై బ్రిటన్ పార్లమెంట్‌లో కీలక ఓటింగ్ నిర్వహించారు. బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా 432 మంది ఓటేయగా.. 202 మంది అనుకూలంగా ఓటేశారు. దీంతో ఓటింగ్‌లో థెరిస్సా ఓటమి పాలయ్యారు. బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటేయాలన్న మే అభ్యర్థనను సభ్యులు పట్టించుకోలేదు. ఓటింగ్‌లో ఓటమి నేపథ్యంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ థెరిసా మే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఒకవేళ అవిశ్వాస తీర్మానం నెగ్గితే మెజార్టీ రాజకీయపక్షం విశ్వాస తీర్మానం ఎదుర్కోవాల్సి ఉంటుంది.

కులాల కుమ్ములాట

- మళ్లీ లింగాయత్‌లు.. వొక్కలిగల పోరు
- 2008లోనూ ఇదే తరహా పోరాటం
- యడ్యూరప్ప-కుమారస్వామి ఫైట్
- ఇప్పుడు అదే తరహా పరిణామాలు
- కర్ణాటకలో ప్రభావవంతమైన కులాలు
- ఇద్దరూ కలిపి జనాభాలో 30 శాతం
- అసెంబ్లీలో సగం బలం ఈ ఇద్దరిదే
- బీజేపీపై వొక్కలిగ మఠాధిపతి ఫైర్



బెంగళూరు, జనవరి 16: కర్ణాటకలో దాదాపు12 ఏళ్ల తర్వాత మళ్లీ చరిత్ర పునరావృతం అవుతోంది. మరోసారి లింగాయత్‌లు.. వొక్కలిగల మధ్య పోరు మొదలవుతోంది. హెచ్‌డీ కుమారస్వామి తాను తొలిసారి ముఖ్యమంత్రి అయినపుడు కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ నాయకుడు యడ్యూరప్పకు పదవి అప్పగించాల్సి వచ్చినపుడు... అందుకు నిరాకరించారు. దాంతో 2008లో రాష్ట్ర అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరిగాయి. లింగాయత్ నాయకుడైన యడ్యూరప్పను వొక్కలిగ నేత కుమారస్వామి వెన్నుపోటు పొడిచారని బీజేపీ ఆరోపిస్తూ ప్రజల వద్దకు వెళ్లింది. ఆ పాచిక పారి.. కొన్ని నెలల తర్వాత ఐదుగురు స్వతంత్ర సభ్యుల మద్దతుతో బీజేపీ అధికారాన్ని చేపట్టింది. ఇప్పుడు వొక్కలిగ నాయకుడైన కుమారస్వామి మళ్లీ కాంగ్రెస్ మద్దతుతో ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. సంకీర్ణ కూటమిలోని ఎమ్మెల్యేలను ఎలాగైనా ఆకర్షించి కుమారస్వామిని పదవీచ్యుతుడిని చేయాలని యడ్యూరప్ప మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే, క్షేత్రస్థాయిలో ఇప్పుడు వొక్కలిగలు తమకు సంప్రదాయ శత్రువులైన లింగాయత్‌లు గౌడ నేతృత్వంలోన ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గౌడలకు గట్టి పట్టున్న మైసూరు ప్రాంతంలోని వొక్కలిగ ఎమ్మెల్యేలు ఇప్పుడు ఇలా ప్రచారం మొదలుపెట్టారు. లింగాయత్‌లు, వొక్కలిగలు కలిపి రాష్ట్రజనాభాలో 30% వరకు ఉంటారు గానీ, ఏ ఎన్నికల్లోనైనా వీళ్లే 50%కు పైగా స్థానాలు గెలుచుకుంటారు. 1956లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈ రెండు బలమైన వర్గాల మధ్య అధికారం కోసం పోరు కొనసాగుతూనే ఉంది.

లింగాయత్‌లు తమది హిందూమతం కాదని, ప్రత్యేక మతమని చెప్పుకొంటారు. రాష్ట్ర జనాభాలో వాళ్లది 16–18% వాటా ఉంటుంది. కానీ ఉత్తర కర్ణాటకలో వాళ్ల ప్రాబల్యం ఎక్కువ. వొక్కలిగలు 12–13% ఉన్నా, మైసూరు ప్రాంతంలో వారిదే అతిపెద్ద కులం. లింగాయత్‌లకు రాష్ట్రంలో చిన్నా పెద్దా కలిపి అనేక మఠాలున్నాయి. వొక్కలిగలకు ఒకే ఒక్క మఠం ఉంది. దానికే బలమైన అధిపతి ఉంటారు. రాష్ట్రంలో జేడీఎస్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్న బీజేపీపై వొక్కలిగ మఠాధిపతి నిర్మలానంద నాథస్వామి కోపంగా ఉన్నారని జేడీఎస్ వర్గాలు అంటున్నాయి.

ఈయన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనా థ్‌కు చెందిన నాథ్ వర్గం వారు. ఆయనకు బీజేపీతో మంచి సంబం ధాలున్నాయి. కానీ, గౌడను పడగొట్టేందుకు లింగాయత్‌ల నేతృత్వంలోని బీజేపీ ప్రయత్నాలు ఆయనకు నచ్చడం లేదని అంటున్నారు.

కుమారస్వామి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు యడ్యూరప్ప ఈ సారి భిన్నమైన మంత్రం వేశారు. బెంగళూరుకు చెందిన వొక్కలిగ ఎమ్మెల్యే డాక్టర్ సీఎన్ అశ్వత్థ నారాయణకు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షించే పని అప్పగించారు. ఇది ఆ కులం నేతలకు ఆగ్రహం తెప్పిం చింది. మఠాధిపతి కూడా అశ్వత్థ నారాయణ వెన్నుపోటు పొడిచారని హెచ్చరించినట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాత మైసూరు ప్రాంతం నుంచి బీజేపీకి తగినన్ని స్థానాలు వచ్చాయి. బెంగళూరు నగరంలో 11 స్థానాలు దక్కాయి. జేడీఎస్ నుంచి వొక్కలిగ ఓట్లు పెద్ద సంఖ్యలో వారికి వెళ్లడం వల్లే ఇలా జరిగిందని అంటున్నారు.

మళ్లీ ఆపరేషన్ కమలం?

రాష్ట్రాన్ని కుల ప్రాతిపదిక మీద మరోసారి విడగొట్టేందుకు ఆపరేషన్ కమలం మళ్లీ మొదలుపెట్టినట్లు కనిపిస్తోందని బెంగళూరుకు చెందిన ఒక జేడీఎస్ ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. 2008లో వొక్కలిగలు తమకు వెన్నుపోటు పొడిచారంటూ యడ్యూరప్ప ఆరోపిం చారని, ఇప్పుడు మరోసారి కుమారస్వామిని పడగొట్టేందుకు అదే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. కానీ తాము కూడా ఊరు కునేది లేదని.. దీని వెనకున్న కులాల కుమ్ములాటను బయటపెడతా మని చెప్పారు. గౌడలను బీజేపీ లింగాయత్‌లకు వ్యతిరేకులుగా ప్రచా రం చేస్తోందని, మరి తాము వాళ్లను వొక్కలిగలకు వ్యతిరేకులని ఎందు కు చెప్పకూడదని ప్రశ్నించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా దళిత కార్డును ముందుకు తెస్తోంది. ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర దళితుడు కావడంతో.. దళిత నాయకుడికి అధికారం రావడం బీజేపీకి ఇష్టం లేదని కాంగ్రెస్ వాదిస్తోంది. ప్రస్తుత సంక్షోభం మరింత ముదరడం తప్పదని, ఇది లింగాయత్‌లు, వొక్కలిగల మధ్య మరింత పోరుకు దారితీస్తుందని భావిస్తున్నారు.

అవి ప్రజల మాట వినవు

- యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌పై ప్రధాని ధ్వజం
- మోదీ స్వదేశీ దర్శన్ ఆరంభం



తిరువనంతరపురం, జనవరి 16: శబరిమల వివాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీలపై తీవ్ర విమర్శలు విమర్శలు చేశారు. మంగళవారం కేరళలోని కొల్లంలో పర్యటించిన ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'స్త్రీ, పురుష సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలకు గౌరవం ఇవ్వాలంటూ వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ పెద్ద పెద్ద మాటలు చెబుతున్నాయి. కానీ వారి చేతలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ముమ్మారు తలాక్‌ని రద్దు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ, కమ్యూనిస్టుల పక్షాలు, కాంగ్రెస్ పార్టీ దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. శబరిమల విషయంలో ఎల్‌డీఎఫ్ ప్రవర్తన ఎలా ఉందంటే... ఓ పార్టీ లేదా ప్రభుత్వం వ్యవహరించిన అతి కిందిస్థాయి తీరుగా చరిత్రలో నిలిచిపోయేలా ఉంది. కమ్యూనిస్టులు భారత చరిత్ర, సంస్క తి, ఆధ్యాత్మికతలను గౌరవించిన మనకు తెలుసు. కానీ, వారికి వీటి పట్ల ఇంతగా ద్వేషం ఉందని ఎవరూ ఊహించలేదు. అలాగే కాంగ్రెస్ పార్టీ శబరిమలపై చాలా రకాలుగా స్పందిస్తోంది. పార్లమెంటులో ఒకలా మాట్లాడుతోంది. శబరిమల ఉన్న జిల్లాలో ఒకలా మాట్లాడుతోంది' అని విమర్శించారు.'యూడీఎఫ్ (కేరళ ప్రతిపక్ష కూటమి), సీపీఎం ఆధ్వర్యంలోని ఎల్‌డీఎఫ్ పేర్లు వేర్వేరు. కానీ, కేరళ యువశక్తిని నిర్లక్ష్యం చేయడంలో మాత్రం ఒకేలా వ్యవహరిస్తున్నాయి. అలాగే, పేదల సంక్షేమాన్ని విస్మరించడంలో, కేరళ ప్రజలను మోసం చేయడంలో ఒకేలా వ్యవహరిస్తున్నాయి' అని మోదీ వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన చెప్పారు. 'కొన్ని రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం.. అగ్రవర్ణ పేదలకు 10 శాతం కోటా రిజర్వేషన్లు తీసుకొచ్చింది. కుల, మత, వర్గ భేదాలు లేకుండా దేశంలోని ప్రతి పౌరుడికి అవకాశాలు దక్కాలని మేము భావిస్తాం. సులభతర వాణిజ్య విధానంలో మన దేశ ర్యాంకు మెరుగుపడుతుందని నాలుగేళ్ల క్రితం ఎవరైనా ఊహించారా? 142వ ర్యాంకు నుంచి ఇప్పుడు మనం 77వ ర్యాంకుకి చేరుకున్నాం. సులభతర వాణిజ్య విధానంలో ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది' అని మోదీ అన్నారు. మోదీ మంగళవారం స్వదేశీ దర్శన్ స్కీమ్‌ను ప్రారంభించారు. శ్రీ పద్మనాభ స్వామి దేవాలయాన్ని సందర్శించారు.

ఎంపీలోనూ కర్నాటకం!

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో బేరసారాలు
- అప్రమత్తమైన హస్తం అధిష్ఠానం

భోపాల్, జనవరి 16: ఎమ్మెల్యేల కొనుగోలుకు బేరసారాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో కర్ణాటక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కిన తరుణంలోనే మధ్యప్రదేశ్‌లోనూ కమలనాథులు బేరసారాలకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేసింది. అయితే కమల్‌నాథ్ సారథ్యంలోని మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ప్రస్తుతానికి వచ్చిన ముప్పేమీ లేదని రాష్ట్ర మంత్రి పీసీ శర్మ తెలిపారు. '3 రాష్ట్రాలు కోల్పోవడంతో వాళ్లు (బీజేపీ) దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయి. ఆ ఎన్నికల్లోనూ ఓడిపోతే వాళ్లు చాలాకాలం ఎదురుచూడాల్సి వస్తుంది. దీంతో ఎంపీలోనూ బేరసారాలకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఉన్న వారంతా, ఎస్పీ కానీ, బీఎస్‌పీ కానీ, ఇండిపెండెంట్ కానీ అంతా మాతోనే ఉన్నారు' అని శర్మ చెప్పారు. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలతో బీజేపీ బేరసారాలు జరుపుతోందన్న వార్తలపై ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మండిపడ్డారు. 'ముందు మీ ఇల్లు కాపాడుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం కోసం మీరేమీ బాధపడాల్సిన పని లేదు' అని బీజేపీని హెచ్చరించారు. ఈనెల ప్రారంభంలో కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సైతం బీజేపీ బేరసారాలకు పాల్పడుతోందంటూ ఆరోపణలు చేశారు. కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరికి రూ.100 కోట్లు బీజేపీ ఆఫర్ చేసినట్టు ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 114 సీట్లు గెలుచుకుని పదిహేనేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్‌ను గద్దెదింపింది. సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 230 మంది సభ్యుల అసెంబ్లీలో బీజేపీకి 109 మంది సభ్యుల బలం ఉంది.

భారీగా జల్లికట్టు

- మదురైలో 19 మందికి గాయాలు
- పోటీలలో వెయ్యికి పైగా ఎద్దులు
- నేడు మరింత భారీ స్థాయిలో పోటీ



మదురై, జనవరి 16: మకర సంక్రాంతి సంబరాలలో కనుమ పండుగ సందర్భంగా తమిళనాడులో జల్లికట్టు పోటీలు పెద్ద ఎత్తున సాగాయి. ఎద్దులను అదుపు చేయడానికి ప్రయత్నించిన వారితో పాటు.. వేడుక చూసేందుకు వచ్చిన వారిని కూడా అవి పొడవడంతో మదురై జిల్లాలో 19 మంది వరకు గాయపడ్డారు. పుదుకొట్టై జిల్లాలో జరిగిన జల్లికట్టులో మరో ముగ్గురు గాయపడ్డారు. 2015లో జల్లికట్టును సుప్రీంకోర్టు నిషేధించినా, ఆ తర్వాత చెన్నై మెరీనా బీచ్‌లో జరిగిన భారీ నిరసన కార్యక్రమం అనంతరం ఋూ నిషేధాన్ని 2016లో ఎత్తేసింది. బుధవారం కనుమ సందర్భంగా నిర్వహించిన జల్లికట్టు పోటీలలో వెయ్యికి పైగా ఎద్దులు పాల్గొన్నాయి. వీటిని బంతిపూలతో అందంగా అలంకరించి మరీ బరిలోకి వదిలారు. వాటిని పట్టుకోడానికి యువకులు తీవ్రస్థాయిలో ప్రయత్నించారు. విజయవంతంగా ఎద్దులను అదుపుచేసిన వారికి బంగారు నాణేలు, టీవీ సెట్లు, మోటారు సైకిళ్ల నుంచి కార్ల వరకు అన్ని స్థాయిల్లో బహుమతులు ఉంటాయి. సోమవారం దాదాపు 50 మంది వరకు గాయపడ్డారని, వారిలో కొందరిని ఆసుపత్రికి తీసుకెళ్లామని ప్రభుత్వాధికారులు తెలిపారు. ఇప్పటివరకు జరిగినవి ఇంకా చిన్న చిన్న జల్లికట్టులేనని, అసలైనది గురువారం మదురైలోని అలంగనల్లూరు పంచాయతీలో అత్యంత భారీగా జరుగుతుందని అంటున్నారు. ఇప్పటివరకు చాలా సందర్భాలలో జల్లికట్టులో ఎద్దులు పొడిచి అనేక మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. అయినా తమిళనాట మాత్రం సంప్రదాయ క్రీడగా ఇది కొనసాగుతూనే వస్తోంది.

చెడు నుంచి రక్షణ కోసం, మంచి సంపద కోసమని కర్ణాటకలో సంక్రాంతి సందర్భంగా ఆవులను మంటల్లోంచి నడి పించారు. ఆవులను ముందుగా దండలతో అలంకరించి, వాటి మెడలో గంటలు కట్టి.. మంటల మీదుగా నడిపించారు. ఇలా చేయడం వల్ల తమ పాడి సంపదతో పాటు పంటలు కూడా ఎలాంటి నష్టం లేకుండా సురక్షితంగా ఉంటాయని కన్నడిగులు నమ్ముతారు.

మత్తుమందిచ్చి..
కారులో గ్యాంగ్‌రేప్

న్యూఢిల్లీ, జనవరి 16: పళ్ల రసంలో మత్తుమందు కలిపి ఇచ్చి, తమకు బాగా తెలిసిన మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు కొందరు వ్యక్తులు. దేశ రాజధాని నగరంలోని ఒక మాల్ సమీపంలో పార్కింగ్ చేసి ఉంచిన కారులో ఈ ఘోరం జరిగింది. దీనిపై బాధితురాలు (24) పోలీసులకు ఫిర్యాదు చేశారు. అటువైపుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఆమె ఏడుస్తుండగా చూసి పోలీసులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తక్షణం అక్కడకు చేరుకుని మహిళ స్నేహితుడు అమిత్ (30)ని అరెస్టు చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న అతడి స్నేహితుల పాత్ర ను విచారిస్తున్నామని డీసీపీ మేఘనా యాదవ్ తెలిపారు.

అర్ధకుంభమేళాకు పోటెత్తిన భక్తులు



ప్రయాగ్‌రాజ్, జనవరి 16: మకర సంక్రాంతి పర్వదినాన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అర్ధకుంభ మేళా మహాక్రతువు ప్రారంభమైంది. త్రివేణి సంగమంలో మంగళవారం ఉదయం 5.15 గంటలకు మొదటి రాజయోగ స్నానాలతో ప్రారంభమైన ఈ కుంభమేళా మార్చి 4 వరకు కొనసాగనుంది. మేళా సందర్భంగా గంగా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. స్నానఘట్టాల దగ్గర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, పారామిలటరీ బలగాలు భారీ గా మోహరించాయి. దాదాపు 20వేల మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. సోమవారం దాదాపు 35లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. భక్తుల కోసం 5.5 కిలో మీటర్ల మేర 35 స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు. కుంభమేళాలో ఈసారి అక్షయ్ వాత్, సరస్వతి కూప్‌ల వద్ద భక్తులకు పూజలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. 450ఏళ్ల కుంభమేళా చరిత్రలో ఈ అవకాశం కల్పించడం ఇదే తొలిసారి. దాదాపు 150 మిలియన్ల మంది భక్తులు కుంభమేళాకు హాజరయ్యే అవకాశం ఉందని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు లక్ష బయో పోర్టబుల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు 25వేల మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. అర్ధకుంభమేళా క్రతువు తొలిరోజు పుణ్య స్నానమాచరించడానికి కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మంగళవారం తెల్ల వారుజామున ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. గంగా నదిలో ఆమె పుణ్యస్నానమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫొటోను ఆమె తన ట్విటర్ ద్వారా పోస్టు చేశారు.





కోహ్లి 100 సెంచరీలు కొడతాడు

- మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్

హైదరాబాద్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి 100 అంతర్జాతీయ శతకాలు సాధించగలడని మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఫిట్‌నెస్ కాపాడుకుంటూ ఇదే ఫామ్ కొనసాగిస్తే అతడు వంద సెంచరీలు కొట్టడం ఖాయమన్నారు. ఆస్ట్రేలియాతో మంగళవారం అడిలైడ్‌లో జరిగిన రెండో



వన్డేలో కోహ్లి సెంచరీ చేశాడు. వన్డేల్లో అతడికిది 39వ సెంచరీ. టెస్టులు, వన్డేలు కలిపి ఇప్పటివరకు 64 సెంచరీలు సాధించాడు. అత్యధిక సెంచరీలు సాధించిన సచిన్, పాంటింగ్ తర్వాత మూడో స్థానంలో ప్రస్తుతం కోహ్లి ఉన్నాడు. 'విరాట్ కోహ్లి నిలకడగా బాగా ఆడుతున్నాడు. ఫిట్‌గా ఉంటే 100 సెంచరీల మార్కును ఖచ్చితంగా చేరుకుంటాడు. కోహ్లి గొప్ప ఆటగాడు. అతడు సెంచరీ చేసినప్పుడు చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే టీమిండియా ఓడిపోయింది' అని అజారుద్దీన్ అన్నారు. అర్ధ సెంచరీతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీని కూడా అజర్ ప్రశంసించారు. ధోని బాగా బ్యాటింగ్ చేశాడని, చివరివరకు వికెట్ కాపాడుకుని విన్నింగ్ షాట్ కొట్టడం అతడికే చెల్లిందని చెప్పారు. దినేశ్ కూడా బాగా బ్యాటింగ్ చేశాడని, మొత్తంగా టీమిండియా ప్రదర్శన బాగుందని అన్నారు.

రెండో రౌండ్‌లో సైనా, కశ్యప్

- కిదాంబి శ్రీకాంత్ కూడా
- మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో నూతన దంపతులు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్‌తో పాటు కిదాంబి



శ్రీకాంత్ కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నారు. బుధవారమిక్కడ జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో తొలిత శ్రీకాంత్ 21-17, 21-11తో హాంకాంగ్‌కు చెందిన ఎన్గ్ క లాంగ్ అంగస్‌ను చిత్తు చేశాడు. తర్వాత సైనా నెహ్వాల్ 14-21, 21-18, 21-18తో హాంకాంగ్‌కే చెందిన జాయ్ జువాన్ డెంగ్‌పై పోరాడి గెలిచింది. తర్వాత కశ్యప్ 19-21, 21-19, 21-0తో రాస్మస్ గెమ్కెను చిత్తు చేశాడు. మహిళల డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప, సిక్కి రెడ్డి జంట 21-16, 22-20తో హాంకాంగ్‌కే చెందిన ఎన్గ్ స్జు యౌ, యియున్ సిన్ యింగ్ జోడీపై గెలిచింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా, సిక్కి రెడ్డి ద్వయం 19-21, 17-21తో రాబింగ్ టాబెలింగ్, సెలెనా పీక్ జంట చేతిలో ఓటమిపాలైంది.

హాకీ కమిటీలో సర్దార్

న్యూఢిల్లీ: హాకీ ఇండియా (హెచ్ఐ) 13 మంది సభ్యుల సెలెక్షన్ కమిటీలో మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్‌కు చోటు దక్కింది. ఈ కమిటీకి 1975 వరల్డ్ కప్ విజేత జట్టు సభ్యులు బీపీ గోవింద చైర్మన్‌గా ఉన్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్ వరకు జట్టులో కొనసాగాలనుకున్న సర్దార్‌కు గతేడాది ఆసియా గేమ్స్‌లో పేలవ ప్రదర్శన కారణంగా బలవంతంగా రిటైర్మెంట్ తీసుకోవాల్సి వచ్చింది. 'సెలెక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉండాలని నాకు ప్రతిపాదన వచ్చింది. దానికి నేను అంగీకరించాను. ఏదో ఒక రకంగా భారత హాకీకి సేవ చేయాలనుకునే నాకు ఇది గొప్ప మార్పుగా అనిపిస్తోంది. ఇది పూర్తిగా భిన్నమైన సవాల్. చాలా ఉత్సాహంగా ఉంది. ఇన్ని ఏళ్లు ఒక ఆటగాడిగా సేవలందించాను. ఇప్పుడు నాణేనికి ఉన్న మరో కోణం నుంచి సేవ చేసే అవకాశం నాకు లభించింది' అని సర్దార్ సింగ్ ఆనందంతో చెప్పాడు.

లెక్క సరిచేశారు

1-1తో సిరీస్ సమం

రెండో వన్డేలో భారత్ గెలుపు

విరాట్ కోహ్లి సెంచరీ

6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఓటమి


హాఫ్ సెంచరీతో అదరగొట్టిన ధోనీ



కోహ్లి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ (104)

అడిలైడ్: తప్పక గెలవాల్సిన అడిలైడ్ వన్డేలో కోహ్లీసేన అద్భుతంగా రాణించింది. చివరి వరకూ ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమిండియాను విజయం వరించింది. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో భారత బౌలర్లు తడబడినా, పరుగులు రాబట్టడంలో బ్యాట్స్‌మెన్ చివరి వరకూ పోరాడి విజయం సాధించారు. రన్ మెషిన్ కెప్టెన్ విరాట్ కోహ్లి (104) సెంచరీ సాధించడంతో మంగళవారమిక్కడ జరిగిన రెండో వన్డేలో టీమిండియా 6 వికెట్లతో ఆస్ట్రేలియాను ఓడించింది. కంగారూలు నిర్దేశించిన 299 పరుగుల లక్ష్యాన్ని మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించి మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. నిర్ణయాత్మక మూడో వన్డే మెల్‌బోర్న్‌లో 18న జరగనుంది.

ఆస్ట్రేలియా నిర్దేశించిన 299 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా ధాటిగానే ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్‌ధావన్‌లు దూకుడుగా ఆడారు. అయితే, 7.4ఓవర్‌లో బెహ్రన్‌డార్ఫ్ బౌలింగ్‌లో ధావన్(32) ఔటయ్యాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి.. ఓపెనర్ రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. క్రీజులో కుదురుకున్నట్లు కనిపించిన ఈ జోడీని స్టొయినిస్ విడదీశాడు. 43 పరుగులు చేసి అర్ధ సెంచరీకి చేరువవుతున్న రోహిత్‌శర్మ.. హ్యాండ్స్‌కోంబ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన రాయుడు(24) కొద్ది సేపటికే ఔట్ కావడంతో భారత బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెరిగింది. ధోని రాకతో కోహ్లికి మంచి భాగస్వామి దొరికాడు. ఇరువరూ వికెట్ల మధ్య పరుగులు తీస్తూ, అడపాదడపా బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును వేగం పెంచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే వన్డేల్లో విరాట్ 39వ శతకాన్ని నమోదు చేశాడు. సాధించాల్సిన రన్‌రేట్ ఎక్కువగా ఉన్నా, ఈ జోడీ ఉందని ధైర్యంగా ఉన్న అభిమానులకు ఒక్కసారిగా షాక్ తగిలింది. సెంచరీతో జోరు మీదున్న కోహ్లి (104)ని రిచర్డ్‌సన్ పెవిలియన్‌కు పంపాడు. దీంతో 82 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. భారత ఇన్నింగ్స్‌లో ఇదే అతిపెద్ద భాగస్వామ్యం కావడం గమనార్హం. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన దినేశ్ కార్తీక్ 25(14) సాయంతో మిస్టర్ కూల్ ధోని 55(54) భారత జట్టును విజయ తీరాలకు చేర్చాడు. చివరి ఓవర్లో సిక్స్ కొట్టి అర్ధశతకాన్ని పూర్తి చేయడమే కాకుండా భారత్



విజయాన్ని ఖరారు చేశాడు ధోని. ఆసీస్ బౌలర్లలో బెహ్రన్‌డార్ఫ్, రిచర్డ్‌సన్, స్టొయినిస్, మ్యాక్‌వెల్ తలో వికెట్ తీసుకున్నారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాట్స్‌మన్ షాన్ మార్ష్ శతకంతో చెలరేగాడు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొని 123 బంతుల్లో 131 పరుగులు చేశాడు. వన్డేల్లో మార్ష్‌కిది 7వ సెంచరీ. తర్వాత మ్యాక్స్‌వెల్ తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 94 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. తొలుత తడబడిన భారత బౌలర్లు ఆఖరి ఓవర్లలో విజృంభించడంతో కేవలం 15 పరుగుల తేడాతో ఆసీస్ చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. భారత బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4, షమీ 3 వికెట్లు తీయగా.. జడేజా 1 వికెట్ పడగొట్టాడు.

విరాట్ శతకం

అనవసర షాట్‌కు యత్నించి ధావన్ పెవిలియన్ చేరగా.. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లి.. రోహిత్‌తో కలిసి ఆచితూచి ఆడాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించారు. అనంతరం రోహిత్ క్యాచ్‌ఔట్‌గా వెనుదిరగగా.. క్రీజులోకి వచ్చిన అంబటి రాయుడుతో కోహ్లి బాధ్యాతాయుతంగా ఆడాడు. మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో రాయుడు స్టొయినిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో 59 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత క్రీజులోకి వచ్చిన ధోనితో కోహ్లి ధాటిగా ఆడాడు. ఈ క్రమంలో 105 బంతుల్లో 5 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 39వ వన్డే సెంచరీని కోహ్లి పూర్తి చేసుకున్నాడు. ఈ సెంచరీ అడిలైడ్‌లో కోహ్లికి ఓవరాల్‌గా 5వది. వన్డేల్లో రెండవది కావడం విశేషం. ఇదే అడిలైడ్ వేదికగా కోహ్లి టెస్ట్‌ల్లో మూడు సెంచరీలు సాధించాడు. ఇక రిచర్డ్సన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన కోహ్లి బౌండరీ లైన్ వద్ద మ్యాక్స్‌వెల్ చేతికి చిక్కడంతో 82 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

ధోని ఫినిషింగ్ టచ్

శతకంతో కోహ్లి.. మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పగా.. దినేష్ కార్తీక్‌తో కలిసి ధోని ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. ఈ జోడి వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ.. చేదించాల్సిన రన్‌రేట్ తగ్గకుండా జాగ్రత్తగా ఆడింది. చివరి ఓవర్లో భారత విజయానికి 7 పరుగులు కావాల్సి ఉండగా.. తొలి బంతికి ధోని భారీ సిక్స్ బాదాడు. ఈ సిక్స్‌తో ధోని 69వ అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఈ సిరీస్‌లో అతనికిది వరుసగా రెండవ అర్ధశతకం కావడం విశేషం. 54 బంతుల్లో 55 పరుగులు చేసిన ధోని ఒక్క ఫోర్ లేకుండా.. రెండు సిక్స్‌లు బాదటం ఇక్కడ మరో విశేషం. మరుసటి బంతిని ధోని సింగిల్ తీయడంతో భారత్.. నాలుగు బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది.

హార్దిక్ పాండ్యకు మరో షాక్

ముంబై : మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు మరో షాక్ తగిలింది. ముంబైలో ప్రతిష్టాత్మక క్లబ్ 'ఖర్ జింఖానా'లో గౌరవ సభ్యత్వాన్ని కోల్పోయాడు. ఇటీవల జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఖర్ జింఖానా సంయుక్త కార్యదర్శి గౌరవ్ కాపాడియా వెల్లడించారు. హార్దిక్ పాండ్య సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు స్పష్టం చేశారు. 'కాఫీ విత్ కరణ్' టీవీ షోలో మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడంతో కేఎల్ రాహుల్‌తో పాటు హార్దిక్ పాండ్య వివాదాల్లో చిక్కుకున్నాడు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వీరిపై బీసీసీఐ నిరవధిక సస్పెన్షన్ విధించింది. వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. పాండ్య, రాహుల్ బేషరతుగా క్షమాపణ చెప్పారు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: క్యారే (సి) ధావన్ (బి) షమీ 18, ఫించ్ (బి) భువనేశ్వర్ 6, ఖవాజా రనౌట్ 21, మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131, హాండ్స్‌కంబ్ (స్టంప్డ్) ధోనీ (బి) జడేజా 20, స్టోనిస్ (సి) ధోనీ (బి) షమీ 29, మాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48, రిచర్డ్స్ (సి) ధావన్ (బి) షమీ 2, లియాన్ నాటౌట్ 12, సిడ్డిల్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 0, బెహ్రాన్‌డార్ఫ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 50 ఓవర్లలో 298/9; వికెట్ల పతనం: 1-20, 2-26, 3-82, 4-134, 5-189, 6-283, 7-283, 9-286; బౌలింగ్: భువనేశ్వర్: 10-0-45-4, షమీ: 10-0-58-3, సిరాజ్: 10-0-76-0, కుల్‌దీప్: 10-0-66-0, జడేజా: 10-1-49-1.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) హాండ్స్‌కంబ్ (బి) స్టోనిస్ 43, ధావన్ (సి) ఖవాజా (బి) బెహ్రెన్‌డార్ఫ్ 32, విరాట్ కోహ్లి (సి) మాక్స్‌వెల్ (బి) రిచర్డ్సన్ 104, రాయుడు (సి) స్టోనిస్ (బి) మాక్స్‌వెల్ 24, ధోనీ నాటౌట్ 55, దినేష్ కార్తిక్ నాటౌట్ 25; ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 49.2 ఓవర్లలో 299/4; వికెట్ల పతనం: 1-47, 2-101, 3-160, 4-242; బౌలింగ్: బెహ్రెన్‌డార్ఫ్: 8.2-1-52-1, రిచర్డ్సన్: 10-0-59-1, సిడ్డిల్: 8-0-58-0, లియాన్: 10-0-59-0, స్టోనిస్: 9-0-46-1, మాక్స్‌వెల్: 4-0-16-1.

హర్మన్ ఫేక్ సర్టిఫికేట్స్ సంగతేంటి?

- వెల్లువెత్తుతున్న ప్రశ్నలు



ముంబై: మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలతో టీమిండియా యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ యువ ఆటగాళ్లు ఒళ్లు మరిచి చేసిన వ్యాఖ్యలు.. ఇప్పుడు వారి కెరీర్‌ను ప్రశ్నార్థకంలో పడేశాయి. వారిపై ఏకంగా ఏడాది నిషేధం విధించే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ వ్యవహారంలో బీసీసీఐ అధికారుల మధ్య వాడి వేడి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాండ్య, రాహుల్‌లపై నిషేధం విధిస్తే.. ఫేక్ సర్టిఫికేట్స్‌తో ఉద్యోగం పొందిన మహిళా టీ20 కెప్టెన్ హర్మన్ ప్రీత్ సంగతి ఏంటనే విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. వారు కేవలం వ్యాఖ్యలు మాత్రమే చేశారని, హర్మన్ ఏకంగా నకిలీ పత్రాలతో ఉద్యోగం సంపాదించిందని, పైగా ఆమె మహిళా టీ20 కెప్టెన్‌గా కొనసాగుతుందనే చర్చజరిగినట్లు తెలుస్తోంది. అప్పుడు హర్మన్‌పై చర్యలు తీసుకోకుండా ఇప్పుడు పాండ్య, రాహుల్‌లపై నిషేధం విధిస్తే బోర్డు గురించి తప్పుడు సంకేతాలు వెలువడుతాయని కొందరు అధికారులు అభిప్రాయపడినట్లు సమాచారం.

మహిళల వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో హర్మన్ ప్రీత్ కౌర్ ఆస్ట్రేలియాపై అద్భుత సెంచరీ చేసి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన విషయం తెలిసిందే. ఈ ప్రదర్శనతో ఆమె రాత్రికి రాత్రి స్టార్ ప్లేయర్ అయింది. దీంతో పంజాబ్ ప్రభుత్వం పోలీసు శాఖలో డీఎస్పీ ఉద్యోగాన్ని ప్రతిపాదించింది. గతేడాది మార్చి1న పంజాబ్ సీఎం అమరిందర్ సింగ్ చేతుల మీదుగా ఆమె బాధ్యతలు చేపట్టింది. అయితే ఆమె నకిలీ డిగ్రీ సర్టిఫికేట్స్ వ్యవహారం తర్వాత వెలుగులోకి రావడంతో పంజాబ్ ప్రభుత్వం డీఎస్పీ హోదా నుంచి తొలిగించింది.

మూడో రౌండ్‌లో ఫెడరర్, కెర్బర్

- రాఫెల్ నాదల్ కూడా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్‌తో పాటు మహిళల విభాగంలో ఏంజెలిక్ కెర్బర్ మూడో రౌండ్‌కు చేరుకున్నారు. ఫెడరర్ చిరకాల ప్రత్యర్థి రాహుల్ నాదల్ కూడా ముందంజ వేశాడు. బుధవారమిక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఫెడరర్‌కు బ్రిటీష్ క్వాలిఫయర్ డాన్ ఇవాన్స్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. అయినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఫెడరర్ 7-6(5), 7-6(3), 6-3తో వరుస సెట్లలో గెలిచి మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. మరో మ్యాచ్‌లో నాదల్ 6-3, 6-2, 6-2తో ఎబ్డెన్‌ను ఓడించాడు. మరో మ్యాచ్‌లో మారిన్ సిలిక్ 7-5, 6-7 (9/11), 6-4, 6-4తో అమెరికాకు చెందిన 23 ఏళ్ల మెకెన్జీ మెక్‌డొనాల్డ్‌పై నెగ్గాడు. మహిళల విభాగానికొస్తే ఏంజెలిక్ కెర్బర్ కూడా మూడో రౌండ్‌కు చేరుకుంది. రెండో రౌండ్ మ్యాచ్‌లో ఆమె 6-2, 6-3తో బ్రెజిల్‌కు చెందిన క్వాలిఫయర్ బీట్రిజ్ హద్దాద్ మైయాను వరుస సెట్లలో చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో స్లోన్ స్టీఫెన్స్ 6-3, 6-1తో తన జూనియర్ డబుల్స్ పార్ట్‌నర్ టిమియా బబోస్‌పై గెలిచింది.





ఇక మంగళవారం జరిగిన పోటీల్లో నోవక్ జొకోవిచ్ 6-3, 6-2, 6-2తో అమెరికాకు చెందిన మిచెల్ క్రుగెర్‌ను ఓడించి రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. మరోవైపు విలియమ్స్ సిస్టర్స్ వీనస్, సెరెనా కూడా తొలి అడ్డంకి దాటారు. తొలి రౌండ్ మ్యాచ్‌లో వీనస్ 6-7 (3), 7-6 (3), 6-2తో 25వ సీడ్ మిహెల బుజార్నెస్క్యూపై పోరాడి గెలిచింది. మరో మ్యాచ్‌లో చెల్లి సెరెనా 6-0, 6-2తో మారియాను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో టాప్ సీడ్ సీమోనా హెలెప్ చెమటోడ్చి రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆమె 6-7 (2/7), 6-4, 6-2తో కియా కనేపిపై నెగ్గింది. ఇదిలా వుండగా మాజీ చాంపియన్ విక్టోరియా అజరెంకాకు ఆదిలోనే చుక్కుదురైంది. తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆమె 7-5 (7/5). 4-6, 2-6తో సీగెమండ్ చేతిలో ఓటమిపాలై ఇంటి ముఖం పట్టిది.

బెస్ట్ ఆల్ రౌండర్ అభినవ్

- ఇంటర్ స్టేట్ ఎమర్జింగ్ టీ20 క్రికెట్

ముంబై: ఎమర్జింగ్ క్రికెటర్స్ డెవలప్‌మెంట్ గ్రూప్ (ఈసీడీజీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు ఇక్కడ ఎమర్జింగ్ టీ20 క్రికెట్ టోర్నీ జరిగింది. ఇందులో జూనియర్ కేటగిరిలో ఈసీడీజీ రెస్ట్ లెవెన్ జట్టు 118 పరుగులతో యంగ్ అచీవర్స్ జట్టును ఓడించి విజేతగా నిలిచింది. కాగా సీనియర్ కేటగిరిలో ప్రెసిడెంట్ లెవెన్ జట్టు రన్నరప్‌తో సంతృప్తి చెందింది. జూనియర్ ఫైనల్స్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఈసీడీసీ రెస్ట్ లెవెన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. అభినవ్



విజేత రెస్ట్ లెవెన్ జట్టు

64, విజయ్ 75, నదీమ్ 54 పరుగులు చేశారు. రిషబ్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యంగ్ అచీవర్స్ జట్టు 19.4 ఓవర్లలో 103 పరుగులకు కుప్పకూలింది. ముఖేష్ 2 వికెట్లు తీశాడు. అయితే ఈ టోర్నీలో అభినవ్ బెస్ట్ ఆల్ రౌండర్ అవార్డును అందుకున్నాడు.. అంతేకాకుండా రెస్ట్ లెవెన్ జట్టులో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా విజయ్, బెస్ట్ బౌలర్‌గా ముఖేష్, బెస్ట్ ఫీల్డర్‌గా బఖార్, ఫైనల్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా విజయ్, ఎమర్జింగ్ ప్లేయర్‌గా, మోస్ట్ డిసిప్లీన్డ్ బాయ్‌గా ఆమెర్ అవార్డులు అందుకున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.